# యెహోవా స్వరము

భక్త్ సింగ్

# విషయ సూచిక


| | | | పుట |
|---|---|---|---|
| 1. | ఆయన స్వరమును వినుడి | ... | 1 |
| 2. | వినుటయే విధేయత | ... | 13 |
| 3. | వేకువ నక్షత్రము | ... | 27 |
| 4. | దేవుని నోటి బూరలు | ... | 41 |
| 5. | సంపూర్ణ విధేయత | ... | 56 |

# ఆయన స్వరమును వినుడి

మత్తయి సువార్త 3వ అధ్యాయము 17వ వచనములో "ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" అను చిన్న వాక్యభాగమును గమనించవలెనని కోరుచున్నాను. ఆ దినమున ఆ స్వరము వినువారికది ఒక అసమానమైన ఆశ్చర్యకరమైన అనుభవమై యుండును.

ప్రభువైన యేసుక్రీస్తు మార్గమును సిద్ధపరచుటకై బాప్తిస్మమిచ్చు యోహాను ఈ లోకములోనికి వచ్చెను. అతడు మారు మనస్సును గూర్చి అరణ్యములో బోధించుటకు మొదలు పెట్టెను. అయితే ఆ వర్తమానమును ప్రజలు అంగీకరించుటకు సులభమైనదికాదు. దూరస్థలముల నుండి ప్రజలు వినుటకు వచ్చిరి. అతడు వారిని సంతోష పెట్టుటకు బోధించుటగాక సజీవుడైన దేవుని అధికారముతో కూడిన బోధ చేయుచుండెను, "పరలోక రాజ్యము సమీపించి యున్నది. మారుమనస్సు పొందు"డని అతడు వ్యత్యాసము లేకుండ (అంతరంగ గూర్చి) చెప్పెను.

ఆ బోధ వినినవారు తమ పాపముల విషయమై పశ్చాత్తాప పడి వాటిని ఒప్పుకొని, బాప్తిస్మము పొందిరి. అట్టి గొప్ప ప్రవక్తవలన బాప్తిస్మము తీసికొనుట ద్వారా ఏదోమేలు పొందుదుమని కొందరు తలంచెదరు. బాప్తిస్మము పొందుటకై వచ్చిన వారిలో ప్రజల నాయకులు సహితముండిరి వారిని చూచి యోహాను "సర్పసంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పినవాడెవడు? మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి" అనెను. అతడు అందరిని

ఉపదేశించి బోధ చేసెను. అయితే కొందరు మాత్రమే లక్ష్యపెట్టి బాప్తిస్మము పొందిరి.

ఒక దినమున ప్రభువైన యేసుక్రీస్తు స్వయముగా బాప్తిస్మము పొందుటకై వచ్చెను. యోహాను సువార్త 1:31లోని దేవుని వాక్య ప్రకారము ప్రభువైన యేసు నిజముగా ఎవరో బాప్తిస్మమిచ్చు యోహాను సహితము ఎరుగడు. యేసు ప్రభువు ఆర్భాటము లేకుండ అందరితోపాటు వచ్చి బాప్తిస్మమియ్యమని యోహానును కోరెను. వారు బంధువులగుటచేత యేసును గూర్చి యోహాను కొంత ఎరిగియుండెను గాని ఆయనే మెస్సీయ అని అతనికి తెలియదు. ఆకాశము తెరువబడి పరిశుద్ధాత్మ క్రీస్తుయేసుపై పావురమువలె దిగుట అతను చూచినప్పుడు యేసు ఎవరో అతడు స్పష్టముగా తెలిసికొనెను. మరునాడు "ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని చాటించెను.

దేవుని స్వరము వినిన తరువాత యేసు ఎవరో యోహాను గ్రహించెనని మనము తెలిసికొనుచున్నాము. మీరును దేవుని స్వరము వినని యెడల ఆయన ఎవరో ఎరుగలేరు. మీరు అనేక సంవత్సరములకు పైగా గుడికి వెళ్ళుచున్నారు. పరిశుద్ధ గ్రంథజ్ఞానము అధికముగా మీకుండ వచ్చును అనేకమైన తర్కములు చేయుచుండవచ్చును, గాని మీరు దేవుని స్వరము వినని యెడల సత్యము మీ యొక్క ఆత్మీయ జీవితమునకు నిరుపయోగము.

ప్రభువు నూతన క్రియలు చేయుటద్వారా సేవను ప్రారంభించలేదు. ఆనాటివరకు ఆయన ఒక్క నూతన క్రియను చేయలేదు. ఒక బోధనైన చేయలేదు. దేవుని స్వరము తెలియపరచిన తరువాతనే ఆయన ఎవరో స్పష్టంగా యోహాను ప్రకటించెను.

మీరు ప్రభువు కృపను అనుభవించవలెననిన ఆయన శక్తిని పూర్తిగా గ్రహించి, ప్రతి దినము ఆయన చిత్తమును ఎరుగవలెనని కోరిన యెడల, నెమ్మదైన ఆయన స్వరమును దినదినము అనేక పర్యాయములు వినుటకు నేర్చుకొనవలెను.

సజీవుడైన మహాశక్తిగల మన దేవుడు మనతోమాట్లాడును. మనము ఆయన స్వరము శ్రద్ధగా వినవలెనని కోరుచున్నాడు. ఈ రహస్యము మనమందరము తెలిసికొనెదము గాక.

"ఇదే త్రోవ దీనిలో నడువుడి" (యెషయా 30:21) అని మనతో చెప్పుచున్న దేవుని స్వరమును మనము ప్రతి దినము వినవలెను. ఇది యెంత సులభమైన మాట! కుడివైపునకుగాని, ఎడమవైపునకుగాని, మనము తొలగుటకు తిరుగునప్పుడు "ఈ మార్గమున నడువవద్దు, ఆ మార్గమున పోరాదు, అప్పుడు అపాయమున్నది" అని ఆ మెల్లని స్వరము మనతో పలుకును. ఈ విధముగా మనమందరము ప్రతి దినము సన్మార్గమున నడిపింప బడవచ్చును.

ఈ లోకములో నున్నంత కాలము మనమందరము శోధనకు గురియగుదుము. మీరు ఎవరైనను సరే ఎక్కడ నున్నను. ఏమి చేయు చున్నను ఇది తప్పదు. మానవులుగా మనము శోధనలు, క్లిష్టపరిస్థితులు, శ్రమలు ఎదుర్కొనక తప్పదు అయితే దేవుని స్వరమును స్పష్టముగా వినగలిగినప్పుడు వీటన్నిటిని జయించగలము.

మన ఆత్మీయ జీవితముయొక్క ప్రారంభదశనుండి ఏ విధముగా ఆయన స్వరమును వినుట నేర్చుకోవలెనో దేవుడు తన వాక్యము ద్వారా మనకు తెలియజేయుచున్నాడు.

నిర్గమకాండము 19:19, 20:1,2 చదువుడి, యెహెజ్కేలు 1:24లో "సర్వశక్తుడగు దేవుని స్వరము"ను గూర్చియు, 10:5లో దేవుడైన సర్వశక్తుడు పలుకుటను గూర్చియు, 1 రాజులు 19:12లో మిక్కిలి నిమ్మళముగా మట్లాడు స్వరమును గూర్చి మనము చదువు చున్నాము.

గొప్ప దైవజనుడగు ఏలియా ప్రార్థించినపుడు ఆకాశము తెరువబడి అగ్ని ఎట్లు దిగివచ్చెనో అను విషయము మీకు జ్ఞాపకముండ వచ్చును. (1 రాజులు 18:38).

19 అధ్యాయములో దుర్మార్గురాలైన యెజెబెలు రాణి ఏలియాను బెదిరించుట చదివెదము. దేవుడామెను తప్పక శిక్షించునని ఏలియా నమ్మి యుండవచ్చును. అయితే అది వెంటనే జరుగనందున అతడు అలిగి ఒక బదరీ వృక్షము క్రింద కూర్చుండెను మనము కూడ కొన్ని సమయములందు అదేవిధముగా ప్రవర్తించుచున్నాము. దేవుని అపార్థము చేసికొని ఆయన యందు నమ్మకము కోల్పోవుచున్నాము. అయితే దేవుని మార్గములు మన మార్గములవంటివి కావు. అవి మన మార్గములకంటె ఎంతో ఉన్నతమైనవి. మనము తలంచిన రీతిగా దేవుడు పనిచేయడు. యెజెబెలును వెంటనే శిక్షింపలేదు గనుక దేవుడు తన విధిని నెరవేర్చలేదని ఏలియా తలంచి యుండవచ్చును. అందుచేతనే "ప్రభువా ఇక చాలును. ఈనాటి నుండి నేను ప్రవక్తగా నుండజాలను అని చెప్పెను. ఎవరైనను ప్రభుత్వోద్యోగమునకు రాజీనామ నివ్వదలచినచో మూడు మాసములు గడువు ఇవ్వవలసియుండును. అయితే ఏలియా ఒక దినము గడువుమాత్రమే ఇచ్చెను. "నీ యొక్క ప్రవక్తత్వము నాయొద్ద నుండి నేనే తీసివేయుము. నీవు నిద్రించుచు, నీ విధిని నెరవేర్చుటలేదు గనుక నేటి నుండి నీ నామమున ప్రవచింపను" అనుచున్నాడు.

అనేక సమయములందు మన ఆలోచన కూడ ఇదే విధముగా నుండును, దేవునినే శాసించునట్లు మాట్లాడెదము. అయితే దేవుడు నిద్రించలేదు. ఆయన ఏలియాను పర్వతము మీదికి తీసుకొనివెళ్ళి అచ్చట అద్భుతరీతిని ప్రత్యక్షమాయెను. తొలుత అచ్చట పెనుగాలి వీచెను. అయితే యెహోవా అందు కనిపించలేదు. తరువాత భూకంపము కలిగెను గాని యెహోవా అందును ప్రత్యక్షము కాలేదు. పిమ్మట మెరుపు పుట్టెను, గాని మెరుపులో ఆయన కనిపించలేదు. తరువాత మిక్కిలి నెమ్మదిగా మాట్లాడు ఒక స్వరము వినబడెను. అప్పుడు దేవుడు తాను ఎప్పుడు ఏ విధముగా ఎక్కడ యెజెబెలనకు తీర్పు తీర్చనైయున్నాడో స్పష్టముగ తెలియజేసెను. అదే సమయమందు జరుగనైయున్న అనేక ఇతర సంఘటనలను ఆయన ఏలీయాకు బయలుపరచెను. దేవుడు మాట్లాడిన కొన్ని సందర్భములు పరిశుద్ధ గ్రంథము నుండి పైన ఉదహరింపబడినవి. దేవుడు మాట్లాడుననునది నిజము. ఆయనను మనము నమ్మినయెడల ఆయన స్వరమునకు చెవియొగ్గి వినవలెను. ఆయన కేవలము భావ రూపమైనవాడు కాదు. ఆయన ఒక వ్యక్తి. ఆయనను మనము తెలిసికొనగలము, వినగలము, స్పర్శించి, ఆయనచే నడుపబడగలము. ఇతర మానవులతో సాధ్యముకానటువంటి ఆత్మీయ సన్నిహితము ఆయనతో మనము కలిగియుండవచ్చును.

అనేక సంవత్సరములుగా స్నేహితులతో కలిసి జీవించినను వారిని నీవు పూర్తిగా అర్థంచేసికొనలేకపోవచ్చును. భార్య బిడ్డలతో అనేక సంవత్సరములు జీవించినను అన్ని విషయములు తెలియ పరచుటకు ధైర్యము చాలదు. మన ఆలోచనలు కొన్ని ఇతరులెవరికి చెప్పరానివి. అయితే దేవునితో చెప్పరాని విషయమేదియు లేదు. మనం

ఏ స్థలమందైనను, ఎట్టి సమయమందైనను ఆయనను సమీపించి, ఆయన స్వరమును వినవచ్చును.

ఒకప్పుడు ప్రవక్తలు, యాజకులు మాత్రమే దేవుని స్వరము వినగలిగెడివారు. ఇతరులెవరైనను దేవుని చిత్తము తెలిసికొనగోరిన యెడల ప్రవక్తయొద్దకుగాని, ప్రధాన యాజకుని యొద్దకుగాని వెళ్ళవలసి యుండెను. దావీదు రాజునకేదైన కష్టము సంభవించినప్పుడు దేవుని స్వరము వినుటకై అతడు యాజకుడైన సాదోకును పిలువనంప వలసి యుండెను ప్రతి మానవుడు దేవుని స్వరము వినుట సాధ్యం చేయుటకై క్రీస్తు యేసు ఈ లోకములోనికి వచ్చెను. ఈ కారణము వలననే ఆయన పరిచర్య ప్రారంభదశలోనే ఆయనపై పరిశుద్ధాత్మ దిగివచ్చెను. దేవుని స్వరము పై నుండి వినవచ్చెను.

ప్రభువు తానే విధముగా మరణమొందెదో, పునరుత్థానము చేయబడి తిరిగి లేవనైయున్నది తన వాక్యము ద్వారా సూచించెను. తన పరిచర్య ప్రారంభదశలో దీనిని ఈ విధముగ సూచన ప్రాయముగా తెలియ పరచెను. గాని, మార్కు సువార్త 8:31, 9:31లందు స్పష్టముగా తెలియపరచెను. సిలువ వేయబడక ముందు కూడా తన మరణమును గూర్చి తెలియపరచెను. చివరికి తన ప్రాణమిచ్చుటకు మరణమును జయించుటకు తన వాక్యము ద్వారా సూచించెను. అప్పుడు ఆకాశము తెరువబడి దేవుని స్వరము వినబడెను. అనుభవము ద్వారా ప్రభుయేసును ఎరిగిన వారు ఆకాశము తెరువబడుట ప్రతిదినము చూచెదరు. దినదినము వారు దేవుని దయ, కృప, ప్రేమ, శక్తి పొందెదరు. వారిని నడిపించుటకు, వారికి సహాయపడుటకు, బోధించుటకు పరిశుద్ధాత్మ అనుగ్రహింపబడెను. ఎందుకనగా సాధారణమైన జ్ఞానముతో గూఢమైన ఆత్మీయసత్యమును గ్రహించుట అసాధ్యము.

మీరు కూడ మీ అవసరము ప్రకారము ప్రతిదినం దేవుని స్వరమును వినవచ్చును. దేవుడు మీ వలన ఏమి కోరుచున్నాడో, మీరేమి చేయవలయునని ఆజ్ఞాపించుచున్నాడో, అది అంతర్వాణి ద్వారా స్పష్టముగ తెలిసికొనవచ్చును.

తరువాత ఉత్పన్నమగు ప్రశ్న యేమనగా దేవుని స్వరమును వినుటను నిశ్చయముగాను, స్పష్టంగాను, ఏ విధముగా వినగలము? మత్తయి సువార్త 3:2లో దానికి జవాబు కలదు. "మారుమనస్సు పొందుడి". ధైర్యముతోను, అధికారముతోను బాప్తిస్మమిచ్చు యోహాను చేసిన బోధ యిది. యేసుప్రభువు తాను బాప్తిస్మము పొందిన దినమున ప్రకటించిన వర్తమానము ఇదియే (మత్తయి 4:17). గ్రీకు భాషలో ఈ పదమునకర్థము పూర్తిగా మరలుట అనగా మనము తూర్పు ముఖులమై నిలువబడిన యెడల పడమటికి తిరిగి నిలుచుండుట మారుమనస్సు పొందుట అట్లుండ వలెను. మనము పాపములో నున్నప్పుడు దేవుని వైపు కాక సైతానునకు విధేయులమై యుందుము. గనుక మనుష్యులము దేవునివైపుగాక సాతాను వైపు తిరిగి యుందుము దేవుని వాక్యము విని పాప ఫలితము తెలిసికొన్నప్పుడు మారు మనస్సు పొంది మనము సాతాను వైపు గాక దేవుని వైపు తిరిగి యుందుము. అయితే అనేక సందర్భములలో అది సంపూర్ణమైన మారుమనస్సుగాక సగం భాగమో లేక కొద్ది ఎక్కువగానో యుండును. మానవులు ఇద్దరు యజమానులు కోరుదురు. ఎట్లనగా కష్టములలో నున్నప్పుడు వారికి దేవుడు కావలయును మిగిలిన సమయంలో సాతానుకు లోబడియుందురు. అది సంపూర్ణమైనదైతేనే తప్ప మారు మనస్సు కానేరదు. పశ్చాత్తాపపడి సాతానువైపు నుండి మన ముఖము త్రిప్పుకొనుటకు దేవుని సహాయం, కృప, మనకు కావలెను. యేసు

తన యొద్దకు వచ్చుట చూచి యోహాను ఎట్లు ఆశ్చర్యపడెనో అదే అధ్యాయం 13,14 వచనములలో చూచుచున్నాము. నిన్ను నీవు తగ్గించుకొంటెనే గాని దేవుని రాజ్యమును గూర్చి నీవు గ్రహించలేవు యేసుప్రభువు బాప్తిస్మమిచ్చు యోహాను కన్న శక్తి, అధికారము గలవాడైయుండి కూడా, మనకొరకై తన్ను తాను తగ్గించుకొని బాప్తిస్మము పొందుటకై యోహాను యొద్దకు వెళ్ళెను. " నేను నీ చేత బాప్తిస్మము పొందవలసిన వాడనై యుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా?" అని యోహాను ఆశ్చర్యపడెను. దైవకృప పొందు రహస్యము తగ్గించుకొనుటయని సూచించుచున్నాడు. మనలను మనం తగ్గించుకొనుకొలది హెచ్చింపబడుదుము. వినయముతోను, దీనత్వముతోను మన పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడుటయే గాక, "ప్రభువా నా పొరుగువారి కన్న నేను శ్రేష్ఠుడనుకాను, లోకరీత్యా ఉన్నత పదవి కలిగియున్నను, నీ దృష్టి యందు పాపినే, మహాపాపిని నా యందు అపవిత్రత, మలినము తప్ప మరేదియు కానరాదు" అని హృదయ పూర్వకముగా ఒప్పుకొనవలెను.

మనకెంత చదువు సంస్కారమున్నను, మన యాలోచన ద్వారా క్రియల ద్వారా మనము అపవిత్ర పరచబడుదుమనునది నిజము. "హృదయము అన్నింటికంటె మోసకరమైనది." అని దేవుని వాక్యము విశదము చేయుచున్నది. మనం ఎంత నాగరికత కలిగియున్నను మన నిజస్వభావము మార్చుకొనలేము. వయస్సు మీరిన కొలది మనలో దుర్మార్గము, మోసము, గర్వము అధికమగును. వినయము ద్వారానే మనకు స్వేచ్ఛ కలుగును. అప్పుడే క్రీస్తు ద్వారా మన పాప స్వభావము నుండి పూర్తిగా విడుదల పొందెదము.

మన ప్రభువు తన బాప్తిస్మము ద్వారా మూడు విషయములు బయలుపరచెను. రోమా 6వ అధ్యాయములో బాప్తిస్మము; మరణ, భూస్థాపన, పునరుత్థానములను సూచించుచున్నది. అంతర్యములో జరుగు మూడు విధములైన మార్పుయొక్క బాహ్య రూపమే బాప్తిస్మము. అనేకుల విషయములో ఇది ఒక ఆచారముగా నున్నది. అందువలననే క్రైస్తవులమని చెప్పుకొనుచువారనేకులు నిష్ఫలమైన జీవితములు జీవించుచున్నారు. బాప్తిస్మము అనగా సాక్ష్యమేగాని, ఒక ఆచారము కాదు. ఇది గ్రహించని యెడల మన క్రైస్తవ జీవితము నిష్ప్రయోజనము. మన పాపములు మరుపబడి పాతిపెట్టబడితేనేగాని, మనకు నిజమైన మనశ్శాంతి కలుగదు. లేనియెడల మన పాపముల స్మరణ మనలను పీడించును.

మీరు పాపము చేసినప్పుడు బహుశ మరల యెన్నటికి నేను పాపం చేయనని చెప్పి యుండవచ్చును. త్రాగుట యందు మీ పాపములను మరచిపోవ ప్రయత్నించవచ్చును. పాపము విషయమై అంత పట్టించుకొనవసరం లేదని ఇతరులు చెప్పవచ్చును. లేదా మనము లోకములో తిరిగి జన్మించము కాబట్టి తిని, త్రాగి సంతోషించెదమను కొనవచ్చును. అయితే మీరు దుఃఖపడు దినములు... రాబోవుచున్నవి ప్రతిపాపము యొక్క స్మరణ మిమ్మును పీడించును. మీరు సంతోషముగా నుండ ప్రయత్నించవచ్చును గాని ప్రయోజన ముండదు. దినదినము అశాంతి, విచారము అధికమగును. అప్పుడు "జీవితము వ్యర్థ" అనిపించును. మన పాపముల నుండి మనము పవిత్ర పరచబడవలెను. అందునిమిత్తమే మన ప్రభువు మరణమొంది భూస్థాపనము చేయబడెను. మనశిక్ష తీసివేయుట కాయన మరణించెను. మన పాప స్వభావమును నశింపజేయుటకై ఆయన మరణించెను.

రాచపుండు ఏ విధముగా చుట్టువున్న కండరములు, కణములతో సహా నిర్మూలింపబడవలసి యున్నదో, అదే విధంగా మన ఆలోచనలకు, కోరికలకు మరణించుటకు విశ్వాసము ద్వారా మరణం యొక్క శక్తిని మన లోనికి తీసికొనవలయును. మనము మరణించెదము అన్న మాట వలన మాత్రము మరణించము. ఉదయమున నేనట్లు చేయును ఇట్లు చేయును అని నేననుకొనవచ్చును. అయితే మనస్సు - "ఫరవాలేదు, దాని వలన నష్టము లేదు" అని మరల అదే పాపము చేసి పతనమగుదుము.

స్వశక్తి ద్వారా మనము విజయము సాధించలేము. మరణము యొక్క శక్తి మనము పొందినప్పుడే ప్రభువు పునరుత్థానశక్తి అనబడు నూతన జీవము మనలో ప్రవేశించును. అది మనలో నిత్యమగువాటికై ఆశ కలిగించును. తదుపరి మనకు దేవుని స్వరమును వినుటకు శక్తి అనుగ్రహింపబడును. ప్రభువైన యేసుక్రీస్తు తాను శ్రమలనుభవించి, మరణమొంది, తిరిగి లేవవలసి యున్నదని తన శిష్యులకు, వివరించి చెప్పినప్పుడు, వారు విచారగ్రస్థులై (మత్తయి 16:21-22; 17:5,) శక్తి గల వాడై యుండి ఎందుకాయన శ్రమ ననుభవించవలెనని ఆశ్చర్యపడిరి. నిజముగా పేతురు ప్రభువుతో ప్రభువా ఇట్టి శ్రమలు నిన్ను అనుభవింపనియ్యమని చెప్పెను.

ఆరు దినములైన తరువాత ప్రభువు వారిని ఒక ఎత్తైయున పర్వతము మీదకి తీసికొనివెళ్ళి. అక్కడ వారి యెదుట ఆయన రూపాంతరము పొందెను అప్పుడు "ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించుచున్నాను" అని ఆకాశము నుండి ఒక స్వరము వినబడెను. మనము దైవికజీవితము కావలయున్నయెడల మన పాత స్వభావమునకు మరణించవలయునని దీని ద్వారా ప్రభువు

తెలియపరచుచున్నాడు. ఆయన సహాయము లేనిదే మన పాత స్వభావమును చంపలేము. మన పాత స్వభావమునకు మరణించునట్లు సహాయపడుటకై ప్రభువు మరణించెను. దీనికి ఋజువేమనగా మనము ఆయనకు విధేయులమైన కొలది మన ముఖములు దివ్యమైన వెలుగుతో ప్రకాశించుననునదియే: ఈ ప్రకాశము సబ్బు మరియు సున్నిపిండి ద్వారా వచ్చునదికాదు కాని, దేవునికి అధిక విధేయులమగుట వలన మనలో ప్రతిబింబించు దేవుని మహిమయై యున్నది.

మనము దేవుని నిమ్మళమైన స్వరమును వినవలెనినచో, మన పాపముల కొరకైన శిక్ష నుండి మనము విడుదల పొందునట్లు మనకు మారుగా ఒకరు మరణించవలెనని దేవుడు సెలవిచ్చుచున్నాడు. మనము నిష్కల్మషమైన జీవితము జీవించునట్లు సహాయపడుటకు దేవుని న్యాయమైన దైవిక చట్టమును నెరవేర్చవలయును. మనలో నూతన జీవమును, తన పునరుత్థానశక్తి పోయుటకు ప్రభువైన యేసుక్రీస్తు తిరిగి లేచెను. ఆ జీవము మనలో ఉన్నప్పుడే మనము ఆ మిక్కిలి నిమ్మళమైన స్వరమును వినగలము. అది నిజముగానే నెమ్మదైన స్వరము. మనము ఆయనను వెంబడించుచు, అనుభవము ద్వారా ఆ స్వరమును గుర్తించగలము.

ఆ మెల్లని స్వరమును దినదినము నేను వినగల్గుచున్నానని దేవుని మహిమార్థమై సాక్ష్యమిచ్చుచున్నాను. గత ముప్పది యేడేండ్లు నుండి వినుచుంటిని. ఏ సమయమందైనను, యే స్థలమందైనను, ఆయనను సమీపించి విన్నవించుకొనగలుగుచున్నాను. ఆయన ప్రేమ పూర్వకమైన స్వరముతో "ఇదే త్రోవ, దీనిలో నడువుము" అని చెప్పుచున్నాడు. సులభమైన దైవ మార్గము ననుసరించి శక్తి పొందిన

యెడల రాను రాను ప్రతిప్రశ్నకు జవాబు దొరుకును. మోకాళ్లాని మీ సందేహములన్నియు కాగితముపై వ్రాసి "ప్రభువా! ఈ ప్రశ్నలకు జవాబిమ్ము, నేడే దారి చూపి నన్ను నడిపించుము. ఫలాని వారి కవసరమైన వర్తమానము దయచేయుము. నీ మహిమార్థమై జీవింప నిమ్ము. నేడు చేయవలసిన పనుల విషయమై నీ చిత్తము తెలియ చేయుము" అని దినదినము ప్రార్థించుచుండుము.

ఈ సులభమైన మార్గము అనుసరించుటకు ముందు హృదయపూర్వకముగా నీవు పశ్చాత్తాపము నొందవలయును. ఏదియు దాచక ప్రతి పాపమును ఒప్పుకొనవలయును. నన్ను శిక్ష నుండి విడిపించుటకై ప్రభువైన యేసుక్రీస్తు నా పాపముల నిమిత్తమై మరణించెనని హృదయపూర్వకముగా నమ్మవలయును. నీ నిమిత్తమై ఆయన మరణించినందులకు కృతజ్ఞత చెల్లించుము. ప్రతిదినము నీకు సహాయము చేయుటకై ఆయన మరణించెను. ప్రభువా మద్యపానం, చలనచిత్రములు చూచుట, క్రోధము, చింతించుట మొదలైన వ్యసనముల నుండి విడుదల గోరుచున్నాను. ప్రభువా! నా పాపములు నీ భూస్థాపనలో పాతిపెట్టుము. ప్రతి శోధన యందును, పరీక్ష యందును నీ పునరుత్థానశక్తితో నింపుము. నాతో మాట్లాడుము. నా భార్యకు, లేదా నా భర్తకు, స్నేహితునికి, పొరుగువానికి చెప్పవలసిన వర్తమానము నాకు దయచేయుము. నీ వాక్యమును అందున్న మర్మములను నాకు తెలియచేయుము. నేడును, భవిష్యత్తు నందును నీ చిత్త ప్రకారము నేను నెరవేర్పవలసిన కార్యక్రమమును వెల్లడి చేయుము అని ప్రార్థించవలెను. అప్పుడు ప్రతిదినము మీరు దేవుని స్వరమును వినగలరు.

☆

2వ అధ్యాయము

# వినుటయే విధేయత

దేవుని ప్రజలందరు దేవుని స్వరమును వినగలరు. దేవుడు మాట్లాడును. గనుక అనుభవము ద్వారా ప్రభువైన యేసుక్రీస్తును ఎరిగియున్న వారందరు వారివారి సమస్యలన్నిటి కొరకును, అవసరతలన్నిటి కొరకును దినదినము ఆయన స్వరమును వినవలెను. ఆయన ప్రేమగల దేవుడు. కావున ఆయనను మన స్వంత రక్షకునిగా అంగీకరించిన యెడల యోహాను సువార్త 10:27 ప్రకారము మనమాయన స్వరమును వినగలుగుదుము. అయితే మన యాత్మ యందే ఈ స్వరమును వినగలము గాని శరీరమందు కాదు. మనుష్యులు తమ భౌతికమైన చెవులతో దేవుని స్వరమును వినవలెనని కోరుదురు. నేను కూడా కొన్నిసార్లు నా భౌతికమైన చెవులతో దేవుని స్వరమును వింటినిగాని, దాని వలన ప్రయోజనమేమియు లేకపోయెను. అయినను ప్రతిదినము అనేకసార్లు మన ఆత్మలో ఆయన స్వరమును వినగలము.

మనము ఆత్మ, జీవము, శరీరము కలిగియున్నాము (ఆదికాండము 2:7). దేవుడు మానవుని సృజించినప్పుడు ఆయన తన స్వంత ఆత్మనే మానవులోనికి ఊదెను. ఎముకలు, రక్తము మరియు కండరములు శరీరమును కలిగించును. జ్ఞాన విమర్శ, ఉద్రేకము, చిత్తస్థైర్యము, జీవమును కలిగించును. మనస్సాక్షి, అంతర్జ్ఞానం, ఆరాధన అనునవి ఆత్మయొక్క లక్షణములు. శరీరము, జీవము, ఆత్మ యనునవి మానవుని యొక్క మూడు ముఖ్య భాగములు. పాపమును బట్టి మరణము శరీరము నందేగాక, ఆత్మ యందు కూడ

ప్రవేశించెను. మనము దేవునికి విరోధమైన ప్రతి తలంపు, మాట, కార్యము, మనస్సాక్షిని చంపుకొనుట ద్వారానే చేయుచున్నాము. కావున అబద్ధమాడవలెనన్న నా మనస్సాక్షిని చంపుకొనవలయును. తెలియని రీతిగానే మన తలంపుల ద్వారా, మాటల ద్వారా, కార్యముల ద్వారా మన ఆత్మలకు మరణము సంభవింప జేయుచున్నాము.

పాపులముగా మనము నిర్జీవమైన ఆత్మ, అంధకారమైన జీవము, అపవిత్రమైన దేహములు, కలిగియున్నాము. మనము నిర్జీవమైన ఆత్మనుబట్టియే ఆయన స్వరమును వినుటకుగాని, ఆయన సన్నిధిని అనుభవించుటకుగాని, ఆయనను స్పర్శించుటకుగాని సమర్థత లేని వారముగా యున్నాము.

ఏలీ యనునొక దైవజనుడు తన పాపమును బట్టి ఆత్మీయముగా మరణించిన వాడాయెను. రాత్రి సమయమందు దేవుడు సమూయేలుతో మాట్లాడెను. సమూయేలు దేవుని స్వరమును వినగలిగెను. గాని వృద్ధ యాజకుడైన ఏలీ తన ఆత్మీయాంధకారమును బట్టి ఆ స్వరమును వినలేకపోయెను. అదేరీతిగా మనమందరము నిర్జీవమైన ఆత్మ, వాతవేయబడిన మనస్సాక్షి గల వారమై యున్నాము. కావున దేవుని మనమెరుగము. ఆయనను ఆరాధించుట కూడా ఎరుగము. ఆయన కదలికల నెరుగము. మనము కూడ అంధకారమైన జీవమును కలిగియున్నాము. కావుననే మన మనస్సును కల్మష పరచుకొనుచు మన జ్ఞానము నందుప్పొంగుచు, అహంకారులముగ నున్నాము. మన భావోద్రేకముల యందు అతిశయించుచు, మన చిత్తములను బట్టి మెడవంచని వారముగ నుండుట వలన మన దేహము అపవిత్ర పరచబడుచున్నది. నీవు సౌందర్యమైన ముఖము

కలిగియున్నప్పటికి, ఇతరులు నీ ముఖము మీద ద్వేషము అత్యాశ, వేషధారణ చిహ్నాములను చూడగలరు.

మనము ప్రభువైన యేసుక్రీస్తు జీవమును పొందిన తరువాత ప్రతివిదములైన మార్పు పొందు చున్నాము. దేవుని ప్రేమ ఎముకలలోను, రక్తంలోను, కండరములలోను పోయబడదు గాని ఆయాత్మ యందే కుమ్మరించబడగలదు. దేవుడు ఆత్మయైయున్నాడు. అట్టి పవిత్రమైన జీవము నా ఆత్మలో ప్రవేశింపక మునుపు దేవుని చేత నేను కడుగబడి పరిశుద్ధపరచబడవలెను. ఆయన రక్తములో నిత్యజీవమున్నది. కావున విశ్వాసము ద్వారా మన శుద్ధీకరణ కొరకై ఆయన ప్రశస్త రక్తమును పొందగలం. మన రక్తంలో భౌతిక జీవమున్నది, కావున మన గుండె కొట్టుకొన్నంత కాలము మనము జీవించగలము.

గుండె పనిచేయుచున్నప్పటికిని శరీరములో పక్షవాతము కలిగిన అంగములు నిర్జీవములుగా నుండును. యుద్ధములో అనేకులు ఒకేసారి ఎన్నో అవయవములు పోగొట్టుకున్నప్పటికిని జీవించుచునే యుందురు. అనాదికాలములోనే దేవుడు "రక్తమే శరీరపు జీవ"మని సెలవిచ్చి యున్నాడు. యేసు ప్రభువు పాపమెరుగనివాడు. పరిశుద్ధాత్మ చేత నింపబడిన అతి పరిశుద్ధుడు. అందువలననే మీలో ఎవరు నాలో పాపమున్నట్లు ఋజువు చేయుగలరని సవాలు చేయగలిగెను (యోహాను 8 : 46). జవాబిచ్చుటకు ఎవరికిని ధైర్యము చాలకుండెను. అందు వలననే ఆయన రక్తమత్యంత నిర్మలమును, ప్రశస్తమైనదై (కీర్తనలు 16:10) మనకొరకు నిత్య జీవమును సంపాదించినది.

మానవుడు మరణించిన క్షణం నుండి కుళ్ళిపోసాగును. అందువలననే ప్రజలు మంచుగడ్డలతోను, సుగంధ ద్రవ్యములతోను దానిని భద్రపరచెదరు. అయితే మన ప్రభువు శరీరము ఏ కుళ్ళును చూడలేదు. ఆ శరీరముతోనే ఆయన తిరిగి లేచెను. కావున నా శరీరమును తిని, నా రక్తమును త్రాగువాడు నిత్య జీవము గలవాడని సెప్పెను. కావున ఆయన రక్తములోను కడుగబడినవారమై, నిత్య జీవమును పొందితిమన్న సత్యమును విశ్వాసము ద్వారా గ్రహించిన తర్వాతనే దేవుని సన్నిధిని అనుభవించగలము.

ఈ విధంగా మనము నిర్జీవమైన ఆత్మను, అంధకార మయమైన జీవమును అపవిత్రమైన దేహములను విడిచి మనము, "పునరుజ్జీవింపబడిన ఆత్మ, వెలిగింపబడిన జీవము పరిశుద్ధ పరచబడిన దేహము" అను మూడు మార్పులను పొందెదము. ఒక మనుష్యుని ఆత్మలో కలుగు మార్పు మనము కంటితో చూడక పోయినను, అతడు నూతన జీవమును పొందినప్పుడు ఆయన ముఖము నందు మార్పులను చూడవచ్చును. ఒక మనుష్యుడు నలుపుగాను, మందమైన పెదవులు కలిగి వికార స్వరూపుడైనప్పటికిని, దేవుని యొక్క జీవము ఆయనలో ప్రవేశించినప్పుడు ఆయన ముఖం మనోహరమైనదిగాను, ఆకర్షణీయంగాను మార్చబడును. నూతన జీవం పొందిన వారి యందు భౌతికము కానిది, విద్యలేక తదితర కృత్రిమ మార్గముల ద్వారా పొందలేని యొక విధమైన సౌందర్యమును, ఆకర్షణను చూడవచ్చును. లోకస్థులు లోకరీతిగా, విలువ గల వస్త్రములను ఆభరణములను ధరించుకొని తాము సౌందర్యము గలవారమని తమ్మును' తాము ప్రదర్శించుకొనవచ్చును. కాని యిట్టి వారిని గురించి పొరుగువారి యభిప్రాయమడిగినచో, వారు

బహిరంగముగా చెప్పకపోయినను, కురూపులు, దురహంకారులు, వేషధారులని భావించెదరు. దేవుడైతే మరియొక విధమైన రూపమును, సౌందర్యమును, దయచేయుననునది నిజము కాదా! ఆ మహిమను పొందుటకు ఈ లోక సంబంధమైన అలంకారము అవసరము లేదు.

దేవుని ఆత్మ మన యందు నివసించు ఈ నూతన జీవితములో, శరీరమందు మరియు జీవాత్మల యందు యుక్తమైన పని జరుగుట చూచెదము. అప్పుడు "ఇదే మార్గము, దీని యందు నడువుము. నా కుమారుడా! జాగ్రత్త కలిగి యుండుము. బిడ్డా ! నా యొద్దకు రమ్ము. నూతన విషయములు నీకు చూపించనిమ్ము. నీకు బోధించనిమ్ము" అనుచున్న దేవుని స్వరము మనము దినదినము వినెదము. కొన్ని సమయములందు మనలను పిలుచు ఒక స్వరము విన్నట్లు మనము గాఢ నిద్ర నుండి మేల్కొనెదము. ఈ యనుభవము నాకనేక మారులు కలిగెను. నేను గాఢ నిద్రలో నున్నప్పుడు ఎవరో నన్ను పేరుపెట్టి పిలుచుట స్పష్టముగా వింటిని. అయితే మేలుకొని చూచినప్పుడు యెవరును కానరాలేదు. మొదట అది నా ఊహయో లేక కలయో అనుకొంటిని. మరల నిద్రించగా అదే స్వరము విని మేల్కొంటిని. ఈ విధముగా రెండు మూడుసార్లు జరిగిన పిదప "నాబిడ్డా! మేలుకొనుము, నీతో మాట్లాడవలెను" అనుచున్న స్వరము వింటిని. మనంతట మనమే మన అవసరముల కొరకు పొందువారి అవసరముల కొరకు దేవుని వాక్యమును దిన దినము పొందుట ఎంతటి ఆధిక్యత, ఘనతయైయున్నది!

యేసుప్రభువు నా జీవితంలోనికి రాకముందు నేనొక నాస్తికునిగా నుంటిని. దేవుడు లేడనిచెప్పుచు, దేవుని యందు విశ్వసించువారిని అపహాస్యము చేయుచుంటిని. అయితే 1920 సం॥

డిశంబరు 16వ తారీఖున " నా కుమారుడా! నీ పాపములు క్షమించబడియున్నవి అను దేవుని స్వరమును స్పష్టంగా వింటిని ఈ విధంగా నేను దేవునితో నడుచుట ప్రారంభించితిని, దేవుని జీవము నాలో ప్రవేశించినప్పుడు జీవాత్మ శరీరముల యందు మూడు విధములైన మార్పులు కలిగెను. పురికొల్పబడిన ఆత్మ, వివేకముతో కూడిన మనస్సు, పవిత్ర పరచబడిన దేహము నాకనుగ్రహింపబడెను. ఇది జరిగిన కొద్ది దినములలో 1930వ సం॥ జనవరిలో నేను ఆదికాండమును చదువ మొదలిడితిని. ఒకే అధ్యాయములో "దేవుడు చెప్పెను. దేవుడు చెప్పెను" అని తిరిగి తిరిగి చెప్పుట గ్రంథమంతటిలో 500 సార్లు ఈ చిన్న వాక్యము నుపయోగింపబడుట గమనించితిని "దేవుడు మాట్లాడును" అను ఈ చిన్నవాక్యమే నా కెంతయో ఆశీర్వాదకరముగా నుండెను. కావున దేవా! నాతో మాట్లాడుము, నీ స్వరమును వినవలెనని కోరుచున్నాను. మరియొక విధమైన అనుభవము కావలయునని ఆశించుట లేదు. నీవు నాతో మాట్లాడి ప్రతి దినము నాకు నీ మార్గము చూపించుమని ప్రార్థించితిని. దేవుడు తప్పక మాట్లాడును అను విషయము గ్రహించుటకు కొంత సమయము పట్టినను ఆయన మనకు సన్నిహితుడైనప్పుడు తప్పక మాట్లాడునని చిన్న బిడ్డవలె నేను విశ్వసించితిని. కొంతకాలమైన తరువాత నేను ఆయన స్వరమును ప్రతిదినము వినసాగితిని. కావున మీరును ఆయన స్వరము విని ఆయన నేర్పించు పాఠములు నేర్చుకొనవలెనని నా కోరిక.

ఆయన స్వరము వినుటకు గల రెండవ మార్గమిప్పుడు చూచెదము. క్రీస్తు బాప్తిస్మము పొందినప్పుడు ఆకాశము ఏ విధముగా తెరువబడెనో మొదట చూచితిమి. దేవుని స్వరమును వినిన సౌలు, పౌలుగా మార్చబడెను. (అపొ. 9.3), ఆయన చుట్టు ఒక వెలుగు

ప్రకాశించెను. అది సూర్యుని వెలుగు కాదు దివ్యమైన వెలుగు. దానిని చూచినప్పుడతడు నేలను పడెను. అటువంటి వెలుగును సౌలు చూచినట్లు మీరు కంటితో చూడక పోవచ్చును. కాని ఆ వెలుగు కంటికి కనుపించని రీతిగా మనలో ప్రవేశింపవచ్చును.

ఎక్స్‌రే ఫొటో తీసినప్పుడు వెలుతురు కిరణములను మనము చూడము. సాధారణమైన ఫొటో తీయునపుడు సూర్యుని వెలుతురు గాని మరియొక విధమైన వెలుతురు గాని అవసరము. అయితే వైద్యశాలలో నీ ఫొటో తీయవలయునన్న, నిన్ను చీకటి గదిలోనికి తోడుకొని పోవుదురు. వెలుతురు వచ్చునని నీవనుకొనవచ్చును. గాని కటుక్కుమను శబ్దము మాత్రమే విందువు. నీవు ఇంటికి వెళ్ళుదువు. మరునాటి దినమున వైద్యుడు స్నేహితుడైన 'యమ్' గారూ, మీ శ్వాసకోశముల పటమును చూడుమని నీకు చూపించునప్పుడు, వారు నా అంతరంగమును ఏ విధముగా చూచిరోయని ఆశ్చర్యపడుదువు. అదే రీతిగా దైవ వెలుగు మనలోనికి ప్రవేశించును.

ప్రభువైన యేసుక్రీస్తునకు అనేక నామములు యివ్వబడినవి (యోహాను 8:12) ఆయన లోకమునకు వెలుగును, మన అంతరంగ పరిస్థితిని చూపించుటకు దైవ వెలుగైయున్నాడు. బహిరంగముగా ఏదైతే కనబడదో అది దైవ వెలుగు ద్వారా కనబడును. ఎంత అనుభవశాలులైన వైద్యులైనను కేవలము నీ వైపు చూస్తూ నీ అంతరంగ పరిస్థితిని తెలిసికొనలేరు. అయితే ఎక్స్‌రే ఫొటో ద్వారానే వారు కనుగొనగలరు.

అదే విధముగా దేవుని వెలుగు మనలో ప్రవేశించి అనేక సంవత్సరములు దాచబడిన పాపములను బయలుపరచును. భౌతికమైన

కన్నులతో చూడకపోయినను, నా విషయములో యిట్లే జరిగెను. యోహాను సువార్త 3:3లో "నేను నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అను మాటలు నా చెవిలో ప్రతిధ్వనించుచుండెను. అట్లైతే ప్రభువా! నేను పాపిని, దేవదూషణ చేసియున్నాను, 1919వ సం॥లో పరిశుద్ధ గ్రంథమును చింపివేసితిని" అని జవాబిచ్చితిని. అప్పుడు నేను మోకరించి నా గత జీవితములో సంపూర్ణముగా మరచిపోయిన అనేక విషయములను చూచితిని.

సౌలుకు కూడ ఇట్లే జరిగెను. ఆయన మొదట వెలుగును చూచి మోకరించెను. తరువాత "సౌలా! సౌలా! నీవేల నన్ను హింసించుచున్నావు" అను ఒక స్వరమును వినెను. అప్పుడు సౌలు తానొక క్రొత్త విషయమును చూచితినను కొనెను. తాను పాప రహితుడననియు, దేవుని సేవించుచుంటిననియు, మరియు దేవుని విషయమై ఆసక్తి గలవాడననియు తలచుకొని యుండెను. అయితే తాను దేవుని శత్రువునని ఇప్పుడు గ్రహించెను. తెలియక దేవుని కార్యమునకు హాని కలిగించుచుండెను. అతడు నిస్సందేహముగా దేవుని వాక్యము నెరిగిన దైవభక్తి గలవాడే. అయితే దేవుని వెలుగు అతడెన్నడును చూడనేలేదు. మనోశక్తితో దేవుని వెంబడించుట కతడు ప్రయత్నించుచుండెను గాని, తన యంతరంగ పరిస్థితి నెరిగినవాడు కాడు. ఇప్పుడు పరిపూర్ణమైన తేజస్సు తనలో ప్రవేశించుట చూచి రోమా 7:18లో "మేలైనది చేయవలయునన్న కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుట లేదు" అని వ్రాసెను. అయితే ప్రభువైన యేసుక్రీస్తు "నా పనికి నీవు తెలియక హాని కలిగించు చున్నావు" అని స్పష్టముగా చెప్పెను. మనలో ప్రవేశించు ఆ వెలుగు వలననే దేవుని పనికిని, మన స్వయమునకును ఎంత హాని కలిగించు

చున్నామో తెలిసికొనగలము. మన నిజస్థితి చూపగలుగునది దేవుని వెలుగు మాత్రమే.

మన శరీర నిజస్థితిని ఎక్స్‌రే యే విధముగా తెలుపగలదో, అదే విధముగా "సూక్ష్మదర్శిని" మన రక్తము యొక్క నిజపరిస్థితిని తెలుపును.

కొన్ని విధములైన దగ్గులు సాధారణమైన దగ్గు మందుకు నయము కావు పూర్వ కాలమందు మందుల ద్వారా దగ్గు పోని యెడల రోగికి దయ్యము పట్టినదని వైద్యులనుకొనెడివారు. అయితే సూక్ష్మదర్శిని ద్వారా రక్తమును పరీక్షింప మొదలు పెట్టిన తరువాత, తెల్లని రక్త కణములు ఎక్కువగుట వలన ఆ దగ్గు కలుగుచున్నదని తెలిసికొనిరి. అప్పుడు దానికి సరియైన విరుగుడును కనుగొనిరి. రోగులు "ఈయన ఎంత అద్భుత వైద్యుడు" అనేక సీసాల మందులు త్రాగినను కుదరని రోగమును ఈయన రెండు సూదులతో కుదిర్చెనని యనవచ్చును. అయితే నిజముగా సూక్ష్మదర్శిని కనిపెట్టుట వలననే ఇది సాధ్యమైనది.

దేవుని వెలుగు మీలో పూర్తిగ ప్రవేశింపనీయుడి. దాని నాటంకపరచవద్దు. మొదట ఆ యనుభవము మనలను విధేయులను చేయునదిగా నుండదు. సౌలు తన జ్ఞానమును గూర్చి, తెలివితేటలను గూర్చి మొదట చాలా గర్వించుచుండెను కాని దేవుని వెలుగు అతనిని సాష్టాంగపడునట్లు చేసెను. సౌలు విశ్వాసులను చెఱసాలలో వేయించుటకు యాజకుల యొద్ద అధికారము పొంది, ఆ యధికార పత్రములను తీసికొని పోవుచుండెను. ఆ సమయములో అతని మనస్సు ద్వేష భావములతో నిండియుండెను. దమస్కులోని విశ్వాసులను చెఱలో

వేయించుటకై అతడు త్వరపడి పయనించుచుండెను. అయితే అతని ఆలోచనలు అధికార పత్రములు ఎగిరిపోయెను. అక్కడ ధూళిలో పడియున్న సౌలుతో ప్రభువిట్లనెను : " నీవు నీ కాలమును, శక్తిని, ధనమును, వ్యర్థపరచుచున్నావు. మునికోలల కెదురు తన్నుచు, నిన్ను నీవే గాయపరచుచున్నావు. సౌలా! నీవు నా కార్యములను ఆపగలవా? నీకు నీవే యే విధముగా హాని చేసికొనుచున్నావో నీ వెరుగవు."

మనమెంత నిజాయితీపరులమైనను, మన హృదయములో జీవించునంత కాలము, మనము దిన దినము మునికోలల కెదురు తన్నుచూ, మనలను మనమే గాయపరచుకొనుచు రాను రాను ఆత్మీయముగా చెవిటివారమును, గ్రుడ్డివారముగ నగుచున్నాము. దేవుని యొక్క సన్నిధిలో సౌలు తన ఆత్మీయ అంధత్వము నెరుగు నిమిత్తము మూడు దినములు అంధుడుగ నుండెను. సౌలు 'నీవెవరవు ప్రభువా!' అని అడుగుటకు బదులు అతడు ఇప్పుడు మీరు మీ మనస్సులో ప్రశ్నించుచున్న రీతినే ఇతర ప్రశ్నలు వేసియుండవచ్చును. అయితే ప్రభువు "నీవు హింసించుచున్న యేసును" అని సమాధానమిచ్చెను. యేసు అను నామమున కర్థము తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించువాడు. నీవు నా ప్రజలను ద్వేషించి, వారిని హింసించుచున్నప్పుడు రక్షకుడైన నన్నే హింసించుచున్నావు. నీవు నా నామమును ద్వేషించినను నేను నిన్ను ప్రేమించుచున్నాను. సౌలా! నీ కొరకు నా రక్తము ధారపోసి, నా ప్రాణమిచ్చితినని ప్రభువతనితో చెప్పెను. నీతో కూడా ప్రభువు అదే చెప్పుచున్నాడు. నీవు ఆయన నామములన్ని ఎరిగి, ఆయనను ఘనపరచవచ్చును. అయితే ఆయన నీ పాపములను క్షమించియున్నాడా? నీ పాపపు స్వభావము నుండి రక్షించియున్నాడా? నీలో ఆయన జీవించుచున్నాడా?

ఉదాహరణకు ఒక నిపుణుడైన వైద్యుడున్నాడను కొనుము. దూర ప్రదేశముల నుండి అనేక రోగులు ఆయన యొద్దకు వెళ్ళుదురని ఇతరులతో నేను చెప్పినప్పుడు "మీరు ఆయన యొద్దకు వెళ్ళియుంటిరా? ఆయన వలన చికిత్స పొంది యున్నారా?" అని అడిగెదరు. "నేను వెళ్ళలేదు గాని నా భార్య ద్వారా విన్నాను" అన్నట్లైన నీకైతే అనుభవము లేదు కదా! అని యందురు. ప్రభువైన యేసు "నేను రక్షకుడనైన యేసును. నీ పాపములకై మరణించితిని" అనుచున్నాడు. ఆయనను నీవు రక్షకునిగా అంగీకరించి, ఆయన నీ కొరకై మరణించినందులకు కృతజ్ఞత తెల్పియుంటివా? నీ పాపములు క్షమించబడినవని నమ్మిక కలిగినదా? ఆయన నీ పాప స్వభావము నుండి నిన్ను విడుదల చేసియున్నాడా? నీలో ఆయన జీవించు చున్నాడా?

సౌలు ఆయన స్వరమును విన్నప్పుడు "ప్రభువా! నేనేమి చేయవలయునని కోరుచున్నావు?" అని అడిగెను. ప్రభువు అతనికి దమస్కునకు వెళ్ళుమని యాజ్ఞాపించెను. నీవు చేయవలసినది అచ్చట తెలియపరచబడును. అతడు ప్రఖ్యాతి గాంచిన వాడైనను దేవునికి విధేయుడై దేవుడు ఆజ్ఞాపించిన ప్రకారము చేయవలసి యుండెను ప్రభువు ముఖాముఖిగా ఎక్కువ విషయములు చెప్పలేదు (అపొ. కార్య. 9:6) పరిచయములేని అననీయ అను వ్యక్తి ఆయన యొద్దకు పంపబడెను. అతడు అపొస్తలుడు కాడు. అతి సామాన్యమైన వ్యక్తి. అతనిని గూర్చి మనకు ఎక్కువగా తెలియదు. ధనికులు, అధికారులు, తమతో సామాన్యులు కాక ప్రఖ్యాతి గలవారు మాట్లాడవలెనని కోరుదురు. ఆత్మీయ విషయములలో కూడా తమతో బిరుదులు కలవారు మాట్లాడవలెనని కోరుదురు అయితే దేవుడు "తగ్గించుకొనుడి"

అనుచున్నాడు. రక్షణ మార్గమంతయు, సౌలుకు ప్రభువే వివరించగలడు. కాని ఆయన అట్లు చేయలేదు. సౌలునకు వివరించుటకు అననీయను పంపెను.అది అతనికి దేవుని స్వరమై యుండెను. గనుక సౌలు తన్ను తాను తగ్గించుకొనినవాడై అననీయ బోధించిన దంతయు నమ్మెను. ఇప్పుడు నేను ఈ అద్భుత మార్గములను తెలిసికొంటిని. నా పాపములు క్షమించబడినవి. నా కొరకై మరణించిన వానిని నేను హింసించుచుంటినని సౌలు తెలిసి కొనెను. అప్పుడతడు అననీయ ద్వారా బాప్తిస్మము పొందెను. అప్పటి నుండి అతడనేకసార్లు దేవుని స్వరమును వినెను.

సౌలు తన జీవితకాలపు పరిచర్య అంతటితో దేవుని స్వరము వినుట ద్వారా ఆయన చిత్తము నెరవేర్చుచు వచ్చెను. (అపో. కార్య. 16అ) గలతీయ. (మూసియ) లందు ప్రభువు శక్తివంతముగా పనిచేయసాగెను. పౌలు బితూనియకు వెళ్ళదలచినప్పుడు ఆత్మ అనుమతి నియ్యలేదు. అప్పుడతడు ప్రభువా! మేము గలతీయలో ఉండవచ్చునా అని అడుగగా ప్రభువు వద్దని చెప్పెను. తరువాత ప్రభువు స్వరము "మాసిదోనియాకు పొమ్ము" అనెను. అది వేరొక ఖండములో నున్నను అతడు ప్రభువాజ్ఞకు లోబడెను.

ఈ రీతిగా ప్రభువైన యేసుక్రీస్తు సువార్త ఐరోపా ఖండములో ప్రవేశించెను. పౌలును, అతని సహచరులను ప్రభువు స్వరము విని విధేయులైరి. (అపో. కార్య. 18:9) శ్రమలు వచ్చినప్పుడు ఆయన నామము నిమిత్తమై శ్రమననుభవించుటయే అధిక్యతగా నుండెను.

నీవేదైన శ్రమ, కష్టము ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు పనిచేయు స్థలములో లేక ఇరుగుపొరుగునందు శత్రువులున్నప్పుడు

ప్రభువు యొక్క స్వరము ఉదయమున లేక మధ్యాహ్నమున "భయపడకుము, నేను నీకు తోడైయున్నాను" అని సెలవిచ్చుచున్నది. ఈ మాటలే నిన్ను ధైర్యపరచి, జయమును చేకూర్చును. "నేను నీకు తోడై యున్నాను, నేను నీకు తోడై యున్నాను" అను మాటలు గత ముప్పది సంవత్సరములలో ఎన్నో పర్యాయములు వింటిని. ఇది మనకు నిత్యానుభవమైనప్పుడు నిరుత్సాహపడి దిగులుతో " నా ప్రాణమును తీసికొమ్ము" అని చెప్పనవసరము లేదు.

అపొస్తలుల కార్యములు 27 ప్రకారము ఓడ అపాయము నందుండెను. దానిలో ఉన్న 276 మంది బ్రతికెదమన్న ఆశ లేకుండెను. తీవ్రమైన తుఫాను వలన వారు భయపడిరి. ఓడ తేలిక చేయుటకు త్రాళ్ళు, ఇతర పరికరములు పడవేసిరి. నావికులు ఓడ విడిచి వెళ్ళిపోవలెనని ప్రయత్నించిరి. అయితే పౌలు వారిని నివారించెను. ఆ రాత్రి దేవుడు పౌలుతో, "పౌలూ! నీవు భయపడకుము, కైసరు యెదుట నీవు నిలువవలసి యున్నది. ఇదిగో ఓడలో ప్రయాణము చేయుచున్న వారి నందరిని నీ కనుగ్రహించియున్నా ననెను." దేవుని యొక్క ఈ స్వరము పౌలుకు విశ్వాసమును కలిగించెను. వారు రక్షింపబడుదురన్న ఆశ లేశ మాత్రమైనను కనుపించక పోయినను, పౌలును అతనితో కూడ నున్న 276 మంది సురక్షితముగా నుందురని దేవుడు అభయమిచ్చెను. తరువాత పౌలు తృప్తిగా తిని నిద్రపోయెను. అతడు భయపడలేదు, ఇతరులను కూడ భోజనము చేయుడని ప్రోత్సాహపరచెను.

అతి స్వల్పమైన కష్టము కూడ నిద్రను పోగొట్టును. అటువంటి సమయములో ఏ మందు కూడ నిద్ర నివ్వ జాలదు. అట్టి పరిస్థితులలో "భయపడకుము, నేను నీకు తోడై యున్నాను" అనుచున్న దేవుని

స్వరము వినవచ్చును. ఇది మానవ స్వరము కాదు. దేవుని స్వరమని దేవుని సన్నిధానము యొక్క అవగాహన మనకు నిశ్చయతను కలిగించుచున్నది. దేవుని స్తుతించుటద్వారా, ఆయన వాక్యమును పఠించుట ద్వారా దేవుని సన్నిధిని గ్రహించుచున్నాము. తరువాతనే ఆయన స్వరమును విందుము. నా విశ్వాసము అధికమగుటద్వారా, ఇది మానవ స్వరము కాదని తెలిసికొందును. తరువాత అనుభవ పూర్వకముగా ఆ స్వరమును తక్షణమే గుర్తించగలము.

భర్త దూర ప్రదేశమునకు వెళ్ళి భార్యకు తెలియకుండ తిరిగివచ్చి నప్పుడు అతడు చిన్నగా దగ్గినను, అతడు పరిసరములలో నున్నాడని భార్య గ్రహించగలదు, ఎక్కడున్నారని ఎవరైన ఆమెనడిగిన యెడల "సరిగా ఎక్కడ ఉన్నాడో తెలియదుగాని, ఆయన స్వరము వినబడుచున్నది" అనును. అయితే వారిద్దరికి సరిపడనప్పుడు, వసారా లో ఆయన కూర్చున్నప్పటికిని ఎక్కడ ఉన్నాడో నాకు తెలియదని ఆమె చెప్పును.

దేవుని స్వరమును వినవలెనని కోరినచో, ప్రభువైన యేసు క్రీస్తును నీ హృదయములో ప్రవేశించి పరిపాలించనిమ్ము. ఆయన యొక్క దివ్యమైన వెలుగు నీలోనికి రానిమ్ము. పాపముల నొప్పుకొనుటకు భయపడవద్దు. ఆయన నీ పాపముల కొరకై మరణించెనని గుర్తించు కొనుము. ఆయనను నీ ప్రేమ గల రక్షకునిగా అంగీకరించుము. దినదినము స్నేహితునివలె ఆయనతో నీవు మాట్లాడుము. ఆయనతో ఎక్కడైన, ఏ విషయమైనను మాట్లాడుము ఆయన నిశ్చయముగా నీతో మాట్లాడవచ్చును. ఇది మాత్రము జ్ఞాపకముంచుకొనుము, ఆయన స్వరమును విన్నప్పుడు తక్షణమే విధేయుడవు కమ్ము.

☆

3వ అధ్యాయము

# వేకువ నక్షత్రము

దేవుని స్వరము వినుట అను రహస్యమును మనము తెలిసికొన్నప్పుడు మన ప్రశ్నలన్నిటికి జవాబు దొరుకును. మన సమస్యలన్ని అవి ఎంత క్లిష్టమైనవైనను పరిష్కరింపబడును. ప్రభువు మాట్లాడునని మరల చెప్పుచున్నాము. ఆయన ప్రేమ గల దేవుడు, మనము ఆయన స్వరము విని, ఆయన ప్రేమను అనుభవించగల జీవము గల వ్యక్తియై యున్నాడు.

నేను అజ్ఞానం చేతను, మూర్ఖత్వంచేతను, గర్వం చేతను, దేవుడు లేడని చెప్పుచు దేవుని యందు విశ్వసించువారిని హేళన చేసిన దినములు కలవు. అయితే ఒక దినమున నేను ఎవరిని కలసికొనుటకు వెళ్ళకయే, నాతో మాట్లాడుటకు నా యొద్దకు ఎవరును రాకయే, నా గదిలో ప్రభువు స్వరము నాతో మాట్లాడుట వింటిని. నాతో మాట్లాడుచున్నది దేవుడని నేను గుర్తించితిని. నలుబది యేండ్ల క్రితం ఆయన నా జీవితమును మార్చి వేసెను. నావంటి పాపిని రక్షించినందుకు దేవునికి స్తోత్రములు. ఇప్పుడు దేవుని స్వరము ప్రతిదినము వినగల అధిక భాగ్యము నేను కలిగియున్నాను. నా ప్రశ్నలన్నిటికి జవాబిచ్చి ఎంత చిక్కు సమస్యలైనను సరే వాటన్నిటిని తీర్చుచున్నాడని ఆయన మహిమార్థమై సాక్ష్యమిచ్చుచున్నాను.

జనవరి 1930వ సం॥ ఆదికాండమును చదువుట ప్రారంభించినప్పుడు, "దేవుడు చెప్పెను, దేవుడు చెప్పెను" అను మాటలు ప్రతి పుట యందు చాలా సార్లు గమనించితిని. పరిశుద్ధ

గ్రంథము నందలి మొదటి ఐదు కాండములలో ఈ మాటలు 558 పర్యాయములు పునరుక్తమయ్యెను. నా పరిశుద్ధ గ్రంథము నందు గుర్తు పెట్టుచు, దేవుడు మాట్లాడుచున్నట్టైన నేను వినవలసియున్నదని అనుకొంటిని. పరిశుద్ధ గ్రంథమును చదువుచు, "దేవా! నా ప్రేమగల దేవా! నాతో మాట్లాడి నాకిప్పుడు సహాయము చేయుము" అని ప్రార్థించితిని. నేను మీతో ఏమి చెప్పు చున్నానో అది ఇతరుల అనుభవం నుండిగాక, నా స్వంత అనుభవం నుండి చెప్పుచున్నాను. మనము లేఖనముల యందలి వివిధ భాగములు చదువుచున్నప్పుడు ఆ కాలమందలి స్త్రీ, పురుషుల జీవితముల యందు దేవుడు ఏ విధముగా ప్రవేశించి తన స్వరమును వారికి వినిపించెనో చూడగలము. తన మార్గములు మనకు బోధించుటకు దేవుడు వివిధ పరిస్థితులను, పద్ధతులను ఉపయోగించును. మనలో ప్రతి ఒక్కరిని నిమ్మళమైన మెల్లని తన స్వరమును వినగలుగు రహస్యమును బోధించును గాక!

మత్తయి సువార్త 17:5లో నున్న "ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" అను పరలోకము నుండి వచ్చిన స్వరము వలన ఈ రహస్యము మనకు విశదపరచబడియున్నది. ప్రభువైన యేసుక్రీస్తు రూపాంతరము పొందినప్పుడు, ఆయనతో కొండ మీద నున్న శిష్యుల నిమిత్తమై ఈ మాటలు చెప్పబడినవి ఆయన స్వరమును మరల వినగల భాగ్యము ఆయన బిడ్డలకు కలదని వారు గ్రహించుటకు ఇవి చెప్పబడినవి. ప్రభువైన యేసు మూడు సంవత్సరములు చేసిన అద్భుత కార్యములను చూచిరి. ఆయన బోధను కూడా వినిరి. వారాయన మాటలను తదేక ధ్యానముతో వినెడివారు. అయినను పరలోకము నుండి "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన మాట

వినుడు " అని స్వరము పలికినప్పుడు వారు దాని భావమేమిటో గ్రహింపలేదు. ఎందుకనగా ఇది వారికి మాటలుగాను, శబ్దముగాను నుండెను గనుక దేవుడు చెప్పినదాని యందు వారానందించలేకపోయిరి.

సౌలు దేవుని స్వరమును విన్నప్పుడు దీనికి భిన్నముగా జరిగెను. సౌలు, అతని సహచరులు దమస్కునకు ప్రయాణము చేయుచుండగా "సౌలా ! సౌలా! నన్నెందుకు హింసించుచున్నావు" అను మాటలు స్పష్టంగా అతనికి వినిపించెను. అతని సహచరులు ఆ స్వరము వినిరి గాని ఆ మాటలు వారికి తెలియలేదు. అది వారికి ఉరుమువలె వినిపించెను. అయితే సౌలు "నీవెవరవు ప్రభువా" అని అడుగగలిగెను. అప్పుడు ప్రభువు "నేను నీవు హింసించుచున్న యేసును" అని ఉత్తరమిచ్చెను. సౌలు తిరిగి నేనేమి చేయవలయునని కోరుచున్నావని ప్రభువును అడిగెను. ఎందుకనగా అతడు దేవుని స్వరమును వినెను. అతని సహచరులకది అర్థరహితమైన శబ్దముగా నుండెను.వారు గ్రహింపలేదు. మత్తయి 17లో చెప్పబడిన ప్రజల పరిస్థితి ఇట్లే ఉండెను. అతి సామాన్యమైన బోధలనేకములు వారు వినిరి.అయితే వాటియొక్క నిజమైన తాత్పర్యమును వారు గ్రహింపకుండిరి.

ఒక సందర్భమునందు ప్రభువైన యేసుక్రీస్తు పరిసయ్యుల పులిసిన పిండిని గూర్చి జాగ్రత్త పడుడని చెప్పెను. అప్పుడు వారు తమ రొట్టెలను తీసికొని వెళ్ళుట మరచియుండిరి ఆ దినముల యందు ప్రయాణీకులు తమతో ఆహారము తీసికొని వెళ్ళవలసి యుండెను. వారట్లు చేయుట మరచినందున ప్రభువు హెచ్చరించు చున్నాడని ఆయన శిష్యులు తలంచిరి. అనేక సమయములందు ప్రభువు యేమి ఉద్దేశించుచుండెనో వారికి గ్రాహ్యం కాకుండెను. అదే విధముగా మీరు అనేక బోధలు విన్నను, అవి మీ స్వంత

అనుభవంలోనికి రాలేదు. కొన్ని సమయములందు ఆ మాటలు ఒక చెవి యందు ప్రవేశించి రెండవ చెవి ద్వారా బయటికిపోవును. ప్రభువు మీతో మాట్లాడునప్పుడు విని గ్రహించుట నేర్చుకొనవలయును. ఇది నేర్చుకొని నప్పుడే మీ జీవితములు మార్పు చెందును. మీ భారము తేలిక చేయబడును, కన్నులు తెరువబడును, సందేహములు తీరిపోయి భయము నిర్మూలించబడును. శత్రువన్నాగములు విచ్ఛిన్నము చేయ బడునని తెలిసికొందువు. ప్రభువు స్వరమును వినుట మహాద్భుతమైన విషయము.

మత్తయి సువార్త 16వ అధ్యాయము 13:15 వచనము లందు యేసుప్రభువు తన శిష్యులను రెండు ప్రశ్నలడుగుచున్నాడు. మొదటిది నేనెవరని జనులు అనుకొనుచున్నారు? యేసుప్రభువు రెండవ ప్రశ్న వేయుటలో ఒక ఉద్దేశ్యమున్నది. అది దేవుని స్వరమును విను రహస్యమును నేర్పుటకే. మొదటి ప్రశ్నకు సమాధానముగా శిష్యులు "కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, మరికొందరు యిర్మీయా లేక ఏలియాయని అనుచున్నారు" అని చెప్పిరి. ఆయన వేసిన రెండవ ప్రశ్న "మీరైతే నేను ఎవరని కొనుచున్నారు?" వెంటనే సీమోను పేతురు "సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తువు" అని చెప్పెను. "సీమోనూ! నీవెవరో తెలిసికొన్నానని ఉప్పొంగిపోవద్దు. పరలోకమందున్న నా తండ్రియే ఇది నీకు బయలుపరచెనుగాని రక్తమాంసములు బయలు పరచలేదు" అని ప్రభువు చెప్పెను. పేతురు తాను ప్రభువుతోనున్న మూడు సంవత్సరములు ఆయన చేసిన అద్భుత కార్యములన్ని చూచుట వలన ఆయన క్రీస్తు అని గ్రహించి యున్నానని చెప్పు చుండవచ్చును. అయితే 'సీమోనూ! ఈ విషయమును నీకు తెలియచేసినవి నా అద్భుత కార్యములు, బోధలు కావు. నీకు

తెలియకనే నన్నారుగుటకు ఒక దివ్యమైన వెలుగునీలో ప్రవేశించెను' అని చెప్పెను.

దేవుని వెలుగు లేనిదే ఆయన స్వరము వినుట అసాధ్యము దేవుని స్వరమును నిస్సందేహముగాను, స్పష్టముగాను, వినవలనన్న ఇది మొదటి మెట్టు. దేవుని వెలుగు నీలో ప్రవేశించి దినదినము అధికముగా ప్రకాశించుచుండును. (సామెతలు 4:15).ఈ వెలుగు నీలో ఒక సూక్ష్మ కిరణముగా ప్రవేశించినప్పటికిని, ఆయనకు విధేయత చూపుకొలది అది ప్రకాశమంతముగా మార్పుబడుచుండును. ఈ దైవ వెలుగులేనిదే నీవు ఆయనను తెలిసికొనలేవు. వినలేవు, మరియు చూడలేవు.

2వ పేతురు, 1వ అధ్యాయము 16-21 వచనములలో యేసుక్రీస్తు యొక్క వాస్తవికతను ఎట్లు కనుగొన్నది పేతురు మరల సాక్ష్యమిచ్చుచున్నాడు. మత్తయి 17వ అధ్యాయము 1-7 వచనములందు ప్రభువు పేతురు, యాకోబు,యోహానులను ఒక పర్వతము పైకి తీసికొని వెళ్ళి వారి యెదుట రూపాంతరం పొందెను. అప్పుడు ఆయన వస్త్రములు మధ్యాహ్న కాల సూర్యుని కంటె ప్రకాశవంతమాయెను. వెంటనే పరలోకము నుండి ఒక స్వరము "ఈయన నా ప్రియ కుమారుడు, ఆయన మాట వినుడు" అని పలికెను. పేతురు తాను కల్పితగాథలు చెప్పుట లేదని తన లేఖనములందు సాక్ష్యమిచ్చు చున్నాడు. ఆ పర్వతం పైన వారు ఆయన మహిమను చూచి ఆయన స్వరము విని ఆ అనుభవము, మరియు వారిని సంపూర్ణంగా మార్చివేసెను (2వ పేతురు 1:18)

దేవుని స్వరము వినుట అత్యంత మహిమకరమైనది అనుభవమని పేతురు చెప్పుచున్నాడు. పేతురా! పర్వతంపై ఆయన రూపాంతర

మహిమ చూడగలిగిన భాగ్యం నీకే దొరికినది. మా బోటి వారి గతియేమి? ఆ యుగములలో అట్లు జరిగియుండవచ్చును. గాని ఈ యుగములో ఈనాటి ప్రజలము దేవుని స్వరమును వినలేము. ఆయన మహిమను చూడలేమని మీరు తలంచవచ్చును. దీనికి సమాధానము (2 పేతురు 1:19లో) గలదు. "మరియు అంతకంటె స్థిరమైన ప్రవచనవాక్యం మనకున్నది. తెల్లవారి వేకువచుక్క మీ హృదయములలో ఉదయించువరకు, ఆ వాక్యం చీకటి గల చోటుల వెలుగిచ్చు దీపమైనట్టున్నది." మీరు నిజముగా దేవుని వాక్యమును విశ్వాసముతో మీ హృదయములలోనికి స్వీకరించిన యెడల, మీలోనున్న వాక్యము దేవుడు వెలుగుమయుడై యున్నాడని చూపించు జ్యోతిగా ప్రకాశించును. అదే పరిశుద్ధాత్మ యొక్క పరిచర్య. మొదటిగా దేవుని వాక్యము ద్వారా మన నిజ స్వరూపమును తెలిసికొందుము. అటు తర్వాత ప్రేమా స్వరూపుడగు మహిమగల దేవుని చూచెదము.

అనేకులు తమ నిజస్థితిని తెలిసికొన్నప్పుడు భయము పొందెదరు. అప్పుడు వారు "నేను పాపిని, అయినను పవిత్రముగా నుండగోరుచున్నాను! అయితే నా పొరుగువారు, లేక నా సహోదరి, సహోదరుల కంటె నేను మెరుగు. అప్పుడప్పుడు అబద్ధములు చెప్పినను, ఎక్కువ మారులు చెప్పను, లంచం కూడా ఎవరైన బలవంతం చేస్తేనేగాని తీసికొనను. స్వయంగా నేను చెయి చాపి అడుగను కావున ఇతరులకంటె నేను కొంతమేలు" అని అనుకొందురు.

ప్రభువు దృష్టి యందు ఏ విధమైన పాపమైనను చెడ్డదే. గాయములో కించిత్తు కల్మషము చేరితే మరణములకు దారి తీయును. ఒక సూక్ష్మ జీవి ఒక కుటుంబము నంతయును నశింపజేయును.

గృహములో ఒకరికి జలుబు చేసిన యెడల ఇంటిలో అందరికి అంటును. ముక్కు మీద చేతి రుమాలుంచి తుమ్మినను జలుబు ఎవరికో ఒకరికి వ్యాపించును.

ఏ విధమైన పాపమైనను భయంకరమైనదే, సులభముగా వినాశనమును కలిగించునదే. మన ఆలోచనలు, మాటలు, క్రియల వలన కలుగు నాశనము నుండి మనలో ప్రవేశించు దేవుని వెలుగు మాత్రమే రక్షింపగలదు. ఆవెలుగే సజీవుడైన రక్షకుని మహిమ, శక్తి సౌందర్యములను మనకు కనబరుచును. మనలను అవమాన పరచుటకుగాను, మానవులు మన పాపములను బయలు పరచెదరు. అయితే దేవుని వెలుగు మనము వాటిని ఒప్పుకొని, వాటి నుండి పరిశుద్ధపరచబడుటకుగాను వాటిని వెల్లడిచేయును. ఆయన మహిమను చూచుటకు మనము పర్వత శిఖరములనెక్క నవసరము లేదని ప్రవచనములు మనకు అభయమిచ్చుచున్నవి. మన మెచ్చట నున్నను ఆయన మహిమ సౌందర్యములను చూడవచ్చును. దేవుని తేజస్సు మనలో ప్రవేశించి మనము దేవుని వాక్యమును ఆత్మ యందు స్వీకరించినప్పుడే ఇది సాధ్యమగును.

దివ్యమైన తేజస్సు నీ లోనికి రావలయునన్న, ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు ప్రతిది దేవుని వాక్కు అని నీ హృదయపూర్వకముగా విశ్వసింపవలెను. ఇది మొదటి మెట్టు.

మనము చదువునది కొన్ని సమయములందు గ్రహింపక పోయినను అది దేవుని వాక్యమే. అది ఎన్నటికిని మారదు. ఇది మానవులకు గ్రాహ్యము కాదు పరిశుద్ధాత్మ ప్రేరేపించిన విధముగా, పరిశుద్ధులైన దైవజనులు పలికినది. దేవుని వాక్యమును భయ

భక్తులతోను, విశ్వాసముతోను, "దేవా! నీ వాక్యము ద్వారా నాతో మాట్లాడుము" అని ప్రార్థించుచూ క్రమముగా ముందుకు సాగిపోవలెను. దేవుని స్వరమును వినుట ఈ విధముగా నేర్చుకొనగలవు.

నేను పరిశుద్ధ గ్రంథమును ప్రప్రథముగా చదివినప్పుడే అది దేవుని వాక్యమనే ఒప్పుదలలోనికి తీసికొని రాబడితిని. నేను బి.ఎ., చదివినప్పుడు అనేక పండితుల గ్రంథములు చదివితిని గాని ఇట్టి పుస్తకమెన్నడును చూడలేదు. మత్తయి సువార్త మొదటి అధ్యాయమును చదివినప్పుడు " ఏ మానవుడునూ, ప్రపంచమునందలి ఏ పండితుడు కూడ ఇట్లు వ్రాయలేడు. ఈ విశిష్టమైన రచన దేవునిదే" అని యనుకొంటిని. అందువలన ప్రభువా! ఇది నీ వాక్యం, దీనిని నేను గౌరవించుచున్నాను. నాతో మాట్లాడి నాకు బోధించుము. ప్రారంభములో సమస్తమును గ్రహించకపోయినను, నీ వాక్యమును నేనెన్నటికిని సంశయించను. నీ చిత్తమైనప్పుడు సంవత్సరమైనను, రెండు సంవత్సరములైనను, నీ వాక్యము నాకు బోధించుము. నేను నిన్ను విసిగించను. నా దినావసరమును బట్టి నాతో మాట్లాడుము" అని ప్రార్థించితిని. అప్పటి నుండి దేవుని వెలుగు దినదినము ప్రకాశవంత మగుట గమనించితిని ఒకవైపు నా అంతర్య చెడు స్థితిని తెలిసికొంటిని. రెండవవైపు నన్ను క్షమించి శుద్ధి చేయుటకు ఆయన అపారమైన కృపను, నా అనుదిన అవసరముల నిమిత్తమై ఆయన చేసిన ఏర్పాటును కనుగొంటిని. "ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడి." అని శిష్యులకు వినిపించిన మాటలు నాకు ఆశాజనకముగా నుండెను. వాటిని నేను నమ్మితిని. ప్రారంభదశ యందు పరిశుద్ధ గ్రంథ పాండిత్యము ద్వారా నీతిమంతుడనగుదుననుకొంటిని గాని పాండిత్యం,

అద్భుతములు, సూచక క్రియలు నన్ను నీతిమంతునిగా చేయలేవని తర్వాత తెలిసికొంటిని. దేవుని స్వరము వినుట వలననే జనులు నీతిమంతులగుదురు. రాత్రి నిద్రించక ముందు ఈ విధముగా ప్రార్థించెడి వాడను: "ప్రభువా! ఈనాడు నా జీవితము నిన్ను సంతోషపెట్టినదా? మాటల వలన క్రియల వలన, ఆలోచనల వలన, పాపము చేసి నిన్ను దుఃఖపెట్టితినా? నేను ఏదైన తప్పిదము చేసిన యెడల నాకు చూపించుము? ప్రభువు నా తప్పిదములను చూపించి నప్పుడు నేను ఒప్పుకొనగా ఆయన నన్ను క్షమించి " నీయందు సంతోషించుచున్నాను, నీవు వెళ్ళుము" అనెను. అప్పుడు సుఖముగా నిద్ర పోయెడివాడను. అయితే - ఏదైనా తప్పిదము చేసి ఒప్పుకొనక పోయినట్లైతే నిద్ర రాక అటు ఇటు పొర్లుచుండెడివాడను. చివరికి మోకరించి, "అవును ప్రభువా! పాపము చేసి నిన్ను బాధపెట్టితిని. నన్ను క్షమించుము. నీ ప్రశస్తరక్తము యొక్క శక్తిని నమ్ముచున్నాను. ప్రభువా, నన్ను క్షమించుము" అనగా, ఆయన " నా కుమారుడా నీ యందు సంతోషించుచున్నాను నిద్రపొమ్ము" అని చెప్పెడి వాడు. ఇప్పుడు నేను నిత్యము సంతోషముగా నున్నాను.

మీరును ఇదే పరిస్థితిలో నున్నట్లయితే మీకును ఈ విధముగానే జరుగును. "ప్రభువా దయతో నేడు నాకు మార్గము చూపుము, నేనశక్తుడను గాన నేనేమిచేయవలెనని నీవు కోరుచున్నావో నాకు తెలుపుము. నేనెచ్చటకు వెళ్ళవలెనో, ఏమి మాట్లాడవలయునో, తెలియజేయుము" అని దిన దినము ప్రార్థించుట నేర్చుకొంటిని. ఆయన ఏర్పాటు తెలిసికొని దానిని వెంటనే అమలు పరచెడివాడను. రాత్రి వేళ మోకరించి అదే ప్రశ్న వేసెడివాడను. 'ప్రభువా నా ప్రేమ నీకు సంపూర్ణ సంతృప్తి కలిగించినదా? నాకు తెలుపుము. నేను

పాఠశాలలో చదివే దినములలో ఎక్కువ మార్కులు అనగా 600 మార్కులు లేక నూటికి 60 మార్కులు తెచ్చుకొన్నయెడల నా స్నేహితులతో నేను ఉత్తీర్ణుడనైతినని చెప్పుచుంటిని. మరియు ఆ ఫలితమును మా తండ్రికి చూపుచుంటిని. ఆయన ఏమి? నూటికి 60 మార్కులేనా? సమయమంత వ్యర్థపరచి ఏమి చేయుచుంటివి?' అని చెప్పుచుండెను. నేనైతే ఉత్తీర్ణుడనైతినని తృప్తి చెందితిని గాని, నా తండ్రి తృప్తి చెందలేదు. మరియు నీవు నూటికి 95 మార్కులు తెచ్చుకొనవలెనని చెప్పెడివాడు.

దేవుడు నీ వలన తృప్తి చెందెనా? ఆయన తృప్తి చెందినప్పుడు స్వరము ఈ రీతిగా వచ్చును: 'నా కుమారుడా! నా కుమార్తె ! నీ యందు నేనానందించుచున్నాను, ఇప్పుడు నిద్రపొమ్ము.' ప్రతిదినము అన్ని విధముల ఈ విషయము చాల సహాయకరముగా నుండెను. స్నేహితులు, లేక ఇరుగుపొరుగు వారు నా విషయము తృప్తి చెందినారా, లేదా అనే సంగతి నాకవసరము లేదు. నా ప్రియరక్షకుడు నా విషయము శ్రద్ధ వహించి నాకు సహాయము చేసెనని నేను నమ్ముచున్నాను. ఆయన నన్ను క్షమించి నన్నుద్ధరించుటకు సిద్ధముగా నున్నాడు. ప్రప్రథమున ఆయన మన యొద్దకు వేకువ చుక్కవలె వచ్చును. (2వ పేతురు 1 : 19).

తేజోవంతమైన వేకువచుక్క (ప్రకటన 22:16) (సంఖ్యాకాండము 24:17) (యెషయా 60:3 కూడా చదువుడి), క్రీస్తు తేజోవంతమైన వేకువ చుక్క. మీరెప్పుడైన పల్లెలలో నివసించి యుండిన యెడల వ్యవసాయ దారులు గడియారములు లేకయే తమ కార్యక్రమములను జరుపుకొనుటను గమనించి యుందరు. పొలమునకు పోవలయునన్న లేక తెల్లవారుజామున ప్రయాణము చేయవలయునన్న

వేకువచుక్కను చూచి సమయమైనది పోవలయుననుకొందురు; దిశను కూడ యీ చుక్కను చూచియే కనుగొందురు.

అనేకసార్లు మనము మేల్కొనవలయునని ప్రయత్నించి నప్పుడు "శరీరము! నా ప్రియ యజమానుడా! మరికొంతసేపు నన్ను నిద్రింపనిమ్ము, అలసియున్నా"ననును. తరువాత అవయవములన్నియు "యజమానుడా! అలసియున్నాము, నిద్రింపనిమ్ము, పొరుగు వారు విసిగించుట వలన గతరాత్రి నిద్రపోలేదు" అన్నట్లుండును.నీవు మేల్కొనిన తరువాత నీ ప్రయాణము దూరమైనది గాను, రాత్రి చాల గడచిపోయినట్లును, ఎండ వేడి యధికమైనట్లును కనిపించును. వేకువ చుక్క మీ కష్టములను, సందేహములను, వ్యధలను, జయించుటకును, ఇతరుల సహాయము లేకయే మీరు దారి తెలిసికొనుటకును సహాయపడును.

యేసుప్రభువు మన లోనికి తేజోవంతమైన వేకువ చుక్కగా వచ్చినప్పటికిని, ప్రారంభమందు కొంత చీకటిని మీరెదుర్కొన వచ్చును. తిరిగి జన్మించిన వెంటనే ఎవరును పరిపూర్ణులు కాలేరన్న సంగతి గుర్తించుకొనవలయును. ఆరంభము నందు అనేక కష్టములు సమస్యలు ఎదుర్కొనవలసి యుండును. మనచుట్టు చీకటియున్నను " నాబిడ్డా! చీకటిని చూచి భయపడకుము. కొద్దిసేపటిలో సూర్యుడు ఉదయించును" అని వేకువచుక్క మనతో చెప్పును. ఆ విధముగానే కొద్దిసేపటిలో వెలుగు మనపై ప్రకాశించుట చూడగలము. మనమెంత తగ్గించుకొందుమో అంత యెక్కువగా ఆ వెలుగును పొందుదుము.

మొదట అనేక విషయములు గ్రహించుటకు కష్టముగా నుండును. నేను పరిశుద్ధ గ్రంథమును నూరు పర్యాయములకు పైగా

చదివిన తరువాత కొద్దిగా గ్రహించ మొదలు పెట్టితిని. ఆదికాండము 1:1 లో "ఆదియందు" అను మాటల భావమిప్పుడు తెలిసికొన్నాను. ఆ మాటల భావమేమిటో మొదట నేను గ్రహింపలేదు. బైబిలు గ్రంథము చదువుతూ తరచుగా నిద్రపోయెడి వాడను. అనేక సంవత్సరముల తరువాత అవే అధ్యాయములు, వచనములు, నా దృష్టికి క్రొత్తగా కనిపించెను. అది మన మార్గమును అధిక ప్రకాశవంతము చేయు "దేవుని కాంతి". దాని కొరకు మనము దేవుని వాక్యమును దేవుని వాక్యముగానే ఎంచి, దేవుడు మాట్లాడువరకు మోకాళ్ళ మీదనే ఉండుట అభ్యాసము చేసికొనవలయును.

ఆరంభమునందే దేవుని అనేక ప్రశ్నలడుగవద్దు. ఒక్క విషయమే అడుగవలయును. "దేవా! నా జీవితము ద్వారా నీకు తృప్తి పడుచున్నావా? నా కోరిక సిద్ధింపజేయుమని వేడుటకు నేను రాలేదుగాని, ప్రభువా! ఒక్క విషయమే తెలిసికొనగోరుచున్నాను, నా జీవితము నీకు సంతోషకరముగా నున్నదా? ప్రభువా ! నా మాటలు, నా పనులు నీ కంగీకారయోగ్యముగా నున్నవా?" అటు పిమ్మట జవాబు కొరకు దేవుని వేధింపక ఓపికతో కనిపెట్టుకొని యుండుము. ఆయన మన సృష్టికర్త. ఆయన యెదుట భయభక్తులతో నిలువుము. ఆయనతో 'నా దేవా! నాకు అనేకమైన పనులున్నవి అయిదు లేక పది నిమిషములలో జవాబివ్వగలిగితే సరి. లేదా ! నేను తిరిగి పోవుదును' అనవద్దు. "దేవా! నీ కనుకూలమైనప్పుడు జవాబిమ్ము" అని అనవలెను. ఆయన తప్పక నీతో మాట్లాడును.

మత్తయి సువార్త 16:11లో ప్రభువు పెద్దల వలన, ప్రధాన యాజకుల వలన తాను శ్రమ ననుభవించి, మరణమై, మూడవ దినమున లేచెదనని తన శిష్యులతో చెప్పెను. ఇది వారిని పర్వతము

పైకి తోడుకొనిపోయి తాను రూపాంతరము పొందక మునుపు జరిగెను. వారి పాపముల కొరకు తాను శ్రమపొంది, మరణించి, పునరుత్థాన మొందెదనని వారికి వివరముగా చెప్పెను. అందువలననే పేతురు ఆయనను ప్రక్కకు తీసికొని వెళ్ళి గద్దించెను. ఆరు దినములైన తరువాత ప్రభువు పేతురును ఒక ఎత్తైన పర్వతముపైకి తీసుకొని వెళ్ళినప్పుడు "ఆయన మాట ఆలకించుడి" యను శబ్దము వినబడెను. సిలువ మార్గము ఉపన్యాసముల ద్వారాగాని, హెబ్రీయ వ్యాఖ్యానముల ద్వారాగాని లేక గ్రీకు వేదాంతముల ద్వారా గాని తెలిసికొనలేము. పర్వతముపై "ఆయన స్వరము వినుడి" అని చెప్పబడెను. ఆయన స్వరము దినదినము సంపూర్ణముగా వినవలయును, అప్పుడే ఆయన శ్రమ మరణము, భూస్థాపన, పునరుత్థానుడై మహిమ నొందుట అనువాటి యొక్క సంపూర్ణ భావము మనము గ్రహించెదము. మానవ వివేకము ద్వారా ఆత్మీయ రహస్యములు గ్రహింప ప్రయత్నించువానికేమియు బోధపడదు. వాడు మానసికముగా కల్లోలమును ఆందోళనను చెందును. అందువలన దినచర్య ప్రారంభించినప్పుడే "ఆయన స్వరము వినవలయును" సావధానముగా నిశబ్దముగ లేచి "ప్రభువా! ఉదయ మధ్యాహ్న సాయం సమయము లందు నాతో మాట్లాడు" నీ వాక్యము ద్వారా నాతో మాట్లాడు"మని ప్రార్థించవలయును. ఆయన : "మంచిది, నా కుమారుడా! నీ యందు నేను సంతోషించుచున్నాను. నీవు వెళ్ళవచ్చును" అనువరకు వేచి యుండవలెను.

ఇట్లు జరుగవలయునన్న సజీవుడైన ప్రభువును నీ హృదయములోనికి ఆహ్వానించవలయును. అప్పుడే ఆయన నీతో మాట్లాడును. ప్రభువా నీవు నాలోనికి వచ్చి, నా పాపములను క్షమించుము" అడిగితేనే తప్ప ఆయన నీ హృదయములోనికి వచ్చి

నివసింపలేదు. నేను అనేక సంవత్సరముల నుండి అనేక ప్రదేశములకు ప్రయాణము చేసి, అనేక గృహములు దర్శించితిని. వాటిలో బీద గృహములు, గుడిసెలు కూడా కలవు. అతిథులుగ, పరదేశులుగ వెళ్ళునప్పుడు వారు "అయ్యా! కొద్దిసేపు ఆగండి. ఇల్లు శుభ్రము చేయుచున్నాను" అని చెప్పి ఒక చాపగాని, కంబళి గాని నేల మీద పరచెదరు. అవికూడ లేని వారు ఒక చీర పరచెదరు. అప్పుడే వారు అయ్యా! లోపలికి రండని పిలిచెదరు.

ప్రభువైన యేసుక్రీస్తును మీరు ఏ విధముగా ఆహ్వానించుచున్నారు? ఆయన నిర్మల హృదయములోనే ప్రవేశించును. తన ప్రశస్తమైన రక్తముతోనే నీ హృదయమును పవిత్రపరచును. కొద్ది దినములు మాత్రమే కాక ఆయన నిరంతరము నీ హృదయములో నివసించును. అప్పుడు సంభవించిన సమస్తము ఆయనతో నీవు చెప్పవచ్చును. ఆయన సమక్షములో కలిగిన సంతోషము వలన ముఖ ప్రకాశముతో నీ దివ్యానుభవమందరికీ చాటించవచ్చును.

☆

4వ అధ్యాయము

# దేవుని నోటి బూరలు

"ఇదే త్రోవ దీనిలో నడువుడి అని నీ వెనుక నుండి యొక శబ్దము నీ చెవులకు వినబడును".

ఈ వచనము దేవుని స్వరమును చూపించునది. ఈ స్వరమును తేటగాను, విశదముగాను వినుటకు నేర్చుకొనవలయుననిన మనము ఎడతెగక ప్రార్థన చేయవలయును. ఎందుకనగా ఈ స్వరమును వినుట ద్వారా మాత్రమే మన ప్రశ్నలకు జవాబులు దొరుకును. మరియు మన అనుదిన సమస్యలన్నియు పరిష్కార మగును. దేవుని స్వరమును వినుటకు ఓపిక, విశ్వాసము అవసరము. చాల కొద్ది మంది విశ్వాసులు మాత్రమే ఆయన స్వరమును అనుదినము విని అనుభవించగల అధిక్యత కలిగి యున్నప్పటికిని దేవుడు మాట్లాడుచునే యున్నాడు. దేవుని స్వరము మనయొద్దకు వచ్చినప్పుడు ఆయన సంపూర్ణముగా బయలుపరచబడినట్లు కీర్తనల 29 అధ్యాయములో తేటగా ఉన్నది. (4,5 వచనములలో) యెహోవా స్వరము దేవదారు వృక్షములను విరచును. (7వ॥లో) యెహోవా స్వరము అగ్ని జ్వాలలను ప్రజ్వలింపచేయుచున్నది. (8వ॥లో) యెహోవా స్వరము అరణ్యమును కదిలించును. దేవుని గొప్ప శక్తి నీ జీవితము కొరకును, నా జీవితము కొరకును ప్రయోజనకరమైనదని చూపించుటకు ఈ వచనములు తిరిగి తిరిగి చెప్పబడియున్నవి.

ఈ పాఠము ప్రవక్తయైన ఏలీయాకు ఏ విధముగా బోధింపబడి యున్నదో మనము ఇదివరకే చూచియున్నాము.

(1 రాజులు 19:12) లో ఏలియా దేవుని నిమ్మళమైన మెల్లని స్వరమును విన్నాడు. దేవుని గొప్ప శక్తి అగ్నిరూపములో దిగివచ్చి బలులను దహించి వేయుటను మరియు వర్షమును కురిపించుటను ఆయన చూచినప్పటికిని ఆయన దిగులుపడి నిరాశగలవాడై ఒక బదరీ వృక్షము క్రింద కూర్చొని యుండుట మనము చూచుచున్నాము. 4వ వచనములో ఆయన ఇక యే మాత్రమును జీవించుట కిష్టము లేదని చెప్పుచున్నాడు. ఏదో ఒక సమయములో మన మందరము కూడ నిరుత్సాహముగాను, క్రుంగిన వారముగాను, వ్యసనపడినవారముగా నున్నట్లు తెలిసి కొందుము. మన భారములు కొన్ని సమయములలో ఎంతో బరువుగా నుండుట మనమందరము తెలిసికొందుము. మరణమును, శ్రమలను, ప్రమాదములను గురించి మనము వినుచుందుము. మన శత్రువులు మనకు విరోధముగా మాట్లాడుట విందుము. ఈ అసంతోషకరమైన పరిస్థితులన్నియు మనలను విచారము గలవారిగాను, క్రుంగిన వారిని గాను చేయును. కావున మనమందరము ఏదో ఒక సమయములో ఆ బదరీ వృక్షము క్రిందికి రావలసినదే. అయితే ఏలియా (1 రాజులు 19:12లో) ఎప్పుడైతే దేవుని స్వరమును వినెనో, ఆయన భారమంతయు ఎత్తబడెను. మరణించవలెనన్న కోరిక ఆయనను విడిచిపోయెను. మరియు దేవుని గూర్చి ఆయన యుండిన ప్రశ్నలన్నియు మాయమైపోయెను. అప్పుడాయన ఒక నూతన కార్యమును [illegible]. దేవుడు తన మనస్సును ఏలియాకు తెలియపరచెను. ఎన్ని సంవత్సరములు [illegible] దేవుని మార్గములు మానవుని మార్గములు కావని ఏలియా తెలిసికొనెను. [illegible]

మనమందరము దేవుని స్వరమునువినుటకును ఆయన మార్గములను తెలిసికొనుటకును తప్పక నేర్చుకొన వలయును.

దేవుని స్వరమును వినుటయును ఈ అనుభవములు ఏ విధముగా మన యనుభవములు కాగలవు? అపొస్తలుడైన పౌలు ఈ పాఠమును తన నూతన జీవితారంభములోనే నేర్చుకొనెను. అపొస్తలుల జీవితమును గూర్చి మనము చదువునప్పుడు ఈ విషయము నెక్కువగా తెలిసికొందుము. సౌలు "ప్రభువా! నేనేమి చేయవలయునని మీరు కోరుచున్నారు" అని ప్రశ్నించినప్పుడు, ప్రభువు తానే సౌలును కలిసికొని దమస్కు పట్టణమునకు వెళ్ళుమని చెప్పెను. ప్రభువు కోరియున్న యెడల సమస్తమును ఆ స్థలమందే తెలియజేసెడివాడు. సౌలు మధ్యాహ్న సూర్య తేజస్సు కంటె ఎక్కువైన ఆయన మహిమను చూడవలయునని ప్రభువు ఆయనకు ప్రత్యక్షమై సౌలా! నీవు హింసించు చున్న యేసును నేనేనని తేటగా చెప్పెను. ఆ విధముగా చెప్పి అంత గొప్ప మహిమను సౌలునకు చూపించినప్పటికిని జరుగబోవు విషయాలను ఆ సమయమందే ఆ స్థలమునందే ఎందుకు తెలుపలేదు? ఎందుకనగా ప్రతిసారి ప్రత్యక్షమై ఆ విధముగా మాటలాడునని ప్రభువు తేటగా ఆయనకు చూపించుచుండెను. మనలో చాలా మంది ప్రభువును మన ఆలోచనల ద్వారనే పరిమిత పరచుట వలన మనము కలవరపడుచున్నాము. మనము ఆయనకొ హద్దు పెట్టలేము ఆయన మనమని తలంచిన ప్రకారము మనతో మాట్లాడుటకు సర్వదా సిద్ధముగనున్నాడు. ఆయన చెప్పినంతయు విన్నవము ద్వారా మనము సమృద్ధియును మొట్టమొదటగా సౌలు పౌలుగా మార్చబడినాడు. మొదటగా ఏదైన దేవుని యొద్ద నుండి వినవలయునన్న ఆయనకు తప్పక విధేయత చూపవలయును. సౌలు

ఏమి చేయవలసినది ఎక్కడ చెప్పబడునో ఆ స్థలమైన దమస్కు అను పట్టణములోనికి వెళ్ళుమని ప్రభువు చెప్పెను. నీకు దేవుడు ఏమైతే చూపించునో దానికి తప్పక నీవు విధేయత చూపవలయును. నేను మరియొకసారి నిన్ను హెచ్చరించునదేమనగా నీవు తిరిగి జన్మించితేనే తప్ప దేవుని స్వరమును వినలేవు. ఎవరైతే నిత్యజీవమనెడి వరమును పొందియున్నారో వారు తప్పక ఎప్పుడో ఎక్కడనో దేవుని స్వరమును వినియుందురు. నీవు ఆ స్వరమును విధేయత చూపినావా! లేక దేవునితో తర్కించుచున్నావా?

చాలా సంవత్సరముల క్రిందట మేము ఒక బహిరంగ సువార్త కూటమును జరిపియుంటిమి. తరువాత టీ కొరకై ఒక పూట కూళ్ళ గృహమునకు వెళ్ళితిమి. అక్కడ కూర్చుని యుండగా నేను " నీవు వెళ్ళి ఆ మూలన కూర్చున్న వ్యక్తికి సువార్తనిమ్ము" అను స్వరమును వింటిని. అయన మీసములవైపు చూస్తూ ఆయన మీసములను బట్టియే సువార్తను వినడని నా హృదయములో నేను చెప్పుకొంటిని. అట్టి మనిషితో మాట్లాడుట సమయము వ్యర్థమేనని తలంచితిని. అయితే "నీవు వెళ్ళుము నీవు వెళ్ళుము" అను స్వరము వచ్చుచుండెను. అప్పుడే నేను వెళ్ళి వణకుచున్న చేతులతో ఒక సువార్త నిచ్చితిని. ఆయన "ఇదేమిటని " అడుగగా అయ్యా ఇది ప్రభువైన యేసుక్రీస్తు గూర్చిన సువార్త అని జవాబిచ్చితిని. ఆయన ఆశ్చర్యపడి, సువార్తనా! నాకొక ఉర్దు బైబిలు కావలయును. ఎవరైన ఒక ఉర్దు బైబిలు యిచ్చెదరాయని రెండు సంవత్సరముల నుండి ఎదురుచూస్తున్నాను. అప్పుడు సంతోష హృదయముతో ఇప్పుడు నాయొద్ద ఉర్దు బైబిలు లేదు. నీ చిరునామా యిచ్చిన యెడల నేను నీ యొద్దకు తీసికొని వచ్చెదనని చెప్పితిని. మరుసటి ఉదయమున ఒక బైబిలు ఆయన

ఇంటికి తీసికొనిపోయి ఏ విధముగా చదువవలయునో తెలియజేసితిని. ఆయన ఎంతో కృతజ్ఞత గల వాడై దేవుని వాక్యము కొరకు యెంతో ఆకలిగలవాడై యుండెను. ఆయన బైబిలు వెల ఇచ్చుటే కాకుండ, సమృద్ధిగా పిండివంటలు, టీ కూడా ఇచ్చెను. రక్షణను గూర్చి మాట్లాడుటకు నాకు తరుణము కూడ దొరికెను. నేను నా స్వంత జ్ఞానముతో వెళ్ళిన యెడల ఆయనకు సువార్త ఇచ్చుటగాని మాట్లాడుట గాని వుండకపోయెడిది. నేను విధేయత చూపినందున దేవుడే విధముగా పనిచేయునో చూడగలిగితిని.

దేవుడు మొదట మనకు ఎక్కువగా ఏమీ చెప్పడు. చిన్న వాక్యములు కొన్ని మాత్రమే ఆయన చెప్పును అడుగడుగున మన మాయనకు విధేయత చూపుకొలది యెన్నో సంగతులను మనకు చెప్పును. దేవుడు మాట్లాడునప్పుడు దీర్ఘమైన వర్తమానము కొరకు వేచి యుండకుము. ఆయన యెంత చెప్పినను విధేయత మాత్రము చూపుము. సౌలు విధేయుడై దమస్కు పట్టణమునకు వెళ్ళినప్పుడు, వేరొక సేవకుని తన యొద్దకు వెళ్ళుటకు దేవుడు సిద్ధపరచినాడని తెలియకుండెను. అననీయ సౌలు యొద్దకు వచ్చి మాట్లాడుట మొదలుపెట్టెను (అపొ. 22:11). సౌలుతో మాట్లాడుచున్న అననీయ స్వరము నిజముగా దేవుని స్వరముగా నుండెను. అపొ. 9:10-15 వచనములలో అననీయ సౌలు యొద్దకు వెళ్ళుటకు తిరస్కరించెను, అయితే దేవుడే ఆయనను సిద్ధపరచెను. కాని దేవుడు అననీయను సిద్ధపరచి ఆయన యొద్దకు పంపినాడని సౌలు ఎరుగనే లేదు. అననీయ సౌలు యొద్దకు వచ్చి ప్రభువు యొక్క వర్తమానమిచ్చెను. ఆ మాటలు అననీయ మాటలుకాక సౌలుతో మాట్లాడుచున్న ప్రభువు మాటలై యుండెను. అప్పుడు సౌలు పౌలుగా మార్చబడెను. నీవు

దేవుని చేత అంగీకరింపబడి యున్నావని అననీయ సౌలుతో చెప్పెను. అది సౌలు నమ్మెను. అనుమానించి నట్లయితే " ప్రభువైన యేసుక్రీస్తునకు ఇన్ని సంవత్సరముల నుండి యెంతో హాని కలిగించితిని ఆయనకు వ్యతిరేకముగా దేవదూషణ చేసితిని. ఎంతో మంది శిష్యులను కారాగారములకు అప్పగించితిని, ఇటువంటి భయంకరమైన పాపము ఇంత సులువుగా ఎట్లు క్షమింపబడగలవని' ' అనుమానముతో చెప్పి యుండెడివాడు.

పౌలు నేను పాపులలో ప్రధానుడనని చెప్పుకొనుటకెప్పుడు విసిగిపోలేదు. అననీయ ద్వారా ప్రభువైన యేసుక్రీస్తు యొద్ద నుండి సామాన్యరతిగా వచ్చిన వర్తమానమును పౌలు నమ్మెను. నా పాపములు పోయినవి నేను హింసించుచున్న యేసుక్రీస్తు నన్ను యేర్పరచుకొనెను, స్వీకరించెను, అంగీకరించెను. ఆయన నన్ను క్షమించుటేగాక నన్ను ఆయనకు సాక్షిగా చేసెను. నేను ఆయన మహిమను చూడవలయునని, ఆయన స్వరమును వినవలయునని ప్రభువు కోరుచున్నాడు, అని పౌలు చెప్పగలిగెను. కొంత మంది మాత్రమే దేవుని మాటలను నమ్ముదురు. అననీయా! నా పాపములు క్షమించబడినవని నీ కెట్లు తెలియును ? అని పౌలు ప్రశ్నించి యుండవచ్చును అయితే యే వాదము లేకయే సౌలు అంగీకరించెను. ఎందుకనగా ఆయన యేసుప్రభు నందు విశ్వసించెను. కావున ప్రభువే అననీయ ద్వారా తనతో మాట్లాడెనని నమ్మెను. ప్రభువు తన వర్తమానికుల ద్వారా, సేవకుల ద్వారా, మరియు సాక్షుల ద్వారా మాట్లాడును. ఎక్కడనో, ఎవరి ద్వారానో మాట్లాడును. ఎక్కడనో, ఎవరి ద్వారానో మాట్లాడబడిన మాటలు సామాన్యమైనవి కావని నీ మనస్సాక్షి యందు నీవు తెలిసికొందువు.

కొన్ని సంవత్సరముల క్రిందట ఒక యౌవనస్థుని కలియు నిమిత్తమై ఒక గృహమునకు వెళ్ళితిని, కొద్ది సమయము మాట్లాడు చుండగా, అకస్మాత్తుగా స్నేహితులు వచ్చి మేము భోజనము సిద్ధపరచు చుండగా, నీవు మాట్లాడుచూ వుండుమనిరి. అప్పుడు ఆ యౌవనస్థుని ముఖము తేటగా చూచితిని. అతనిని కలిసికొనుట ఇదియే మొదటిసారి. అయితే "ఈ యౌవనస్థునితో ఈ విధముగా చెప్పుము" అను స్వరము నాతో చెప్పుట వింటిని. "ఈ యౌవనస్థునితో నాకు పరిచయము లేదు, ఆయన కోపపడునేమో" అని తలంచితిని. మరల నాలో "అతడు తన పాపమును విడిచిపెట్టని యెడల అతడు నరకమునకు పోవును' 'అని చెప్పుమను స్వరము నాయొద్దకు వచ్చెను. కావున నేను " నీవు నా పాపమును విడిచి పెట్టని యెడల నరకమునకు పోవుదువు" అని చెప్పితిని. ఆ క్షణంలోనే ఆ స్నేహితుడు కాఫీ తీసికొని వచ్చెను. ఆ యౌవనస్థునితో ఇంకా ఎక్కువ మాట్లాడకుండ అతడు నన్ను తప్పించినందుకు నేను సంతోషించితిని. మరుసటి దినమున ఫోను ద్వారా ఒక వృద్ధుడు "నేను వచ్చి నిన్ను చూడవచ్చునా" అని యడిగెను. దయచేసి వెంటనే రమ్మని నేను జవాబిచ్చితిని. ఒక పొడుగాటి మనిషి కన్నీటితో నాగదిలో ప్రవేశించి, గత రాత్రి నా కుమారునితో మాటలాడి నందులకు మీకు వ్యక్తిగతముగా కృతజ్ఞత చెప్పుటకు వచ్చితినని నాతో చెప్పెను. అయ్యా! నేనేమియు అతనికి చెప్పలేదని జవాబిచ్చితిని. మీరు మాట్లాడిన ఆ యౌవనస్థుడు నా కుమారుడని ఆయన నాతో చెప్పెను. గత రెండు సంవత్సరములుగా అతడు పాపములో జీవించు చున్నాడు. అతడు ఇల్లు విడిచి వెళ్ళిపోయి యుండెను. మేము భార్యాభర్తలము మిక్కుటము దుఃఖభరితులమై యుంటిమి. మీరతనితో ఏమి చెప్పితిరో నేనెరుగను. అయితే మీరతనితో మాట్లాడిన తరువాత, అతడు మా యొద్దకు వచ్చి పాదముల మీద పడి మమ్మును క్షమాపణ

యడిగెను. నేనతనిని, అతని వ్యక్తిగత జీవితమును గాని యెరుగను. "నీవు నీ పాపమును విడువకుండిన నీవు నరకమునకు పోవుదువు' ' అని ప్రభువు తేటగా, గట్టిగా అతనితో చెప్పుమని నాతో చెప్పెను. ఈ విధముగా తాను సిద్ధపరచిన ఆత్మలతో మాటలాడుటకు తన వర్తమానికులను, సాక్షులను ఉపయోగించును. కొన్ని సమయములలో మీరు నడిపించువారుగను, లేక ఆదరించువారుగనుందురు. దేవుడు మీతో మాటలాడునప్పుడు శ్రద్ధతో ఆలకించుడి. మరియు బోధకుల ద్వారా దేవుడు మాటలాడునప్పుడు వారి మీద కోపపడవద్దు. కొన్ని సంవత్సరముల క్రితము ఒక యౌవనస్థుడు ఎంతో బోధించబడిన తరువాత ఒక కూటమునకు వచ్చెను. ఆ విధముగా చేయవలయునని తల్లి యెడతెగక అతని నడుగుచుండెను. అయితే ఈ యౌవనుడు గడచిన కాలమంతయు తిరస్కరించుచునే యుండును. ఒక సాయంకాలమున ఎవరికి తెలుపకుండ అతడు కూటమునకు వచ్చెను. కూటము అయిపోయిన తరువాత అతడు ఇంటికి వెళ్ళి తన తల్లిపై ఎంతో కోపముగా నుండెను. అతడు తల్లిని చూచి " నీవు వెళ్ళి నీ విషమంతయు బోధకునికి ఎందుకు చెప్పినావు" అని అడిగెను. ఆమె " నాకుమారుడా నిన్ను గూర్చి ఒక్క మాటైనను యెవరికి చెప్పలేదని' ' అతనితో చెప్పెను. ఆ యౌవనస్థుడు తల్లిని నమ్మక తిరస్కరించుచూ "లేదు లేదు నీవే తప్పక ఈ విధముగా చేసియున్నావు. నేను ఒక మూలన కూర్చొనియుండగా బోధకుడు తన వేలిని నావైపే చూపెను. నేను ఆ మూలను విడిచి వేరొక స్థలమున కూర్చుండగా మరల నావైపే తన వ్రేలును చూపెను. తరువాత మరల నేను వెళ్ళి వెనుక కూర్చుంటిని. మరల ఆయన తన వ్రేలును నావైపే చూపెను. ఆయన చెప్పినదంతయు నన్ను గూర్చియే, నా కొరకే కేవలము నా కొరకు

మాత్రమే చెప్పెను. నన్ను గూర్చి ఆయనకెట్లు తెలియును?" తల్లి "లేదు కుమారుడా ఆయనకు నేనేమియు చెప్పలేదు; దేవుడే నీతో మాటలాడుచున్నాడు, నీ పాపముల నిమిత్తమై పశ్చాత్తాపపడి క్షమాపణ పొందు"మని చెప్పెను. అతడు పశ్చాత్తాపపడగా గొప్ప మార్పు అతనిలో కలిగెను. ఆయన ప్రభువునకు నిజమైన సాక్షి యాయెను.

ప్రభువు బాగుగా యెరిగినవాడు గనుక ఆయన మనందరితో మాటలాడును. బోధకుడు నీవైపు వ్రేలెత్తి చూపక మునుపే, నీకు కూటములో నెమ్మది లేదని యెరిగిన యెడల ప్రార్థనలో ఈ విధముగా చెప్పుము. "ప్రభువా! ఇది మీ స్వరమా? లేక మనుష్యుని స్వరమా?ఇది మీ స్వరమైన యెడల నేను ఒప్పుకొని, నన్ను నేను తగ్గించుకొను చున్నాను. నన్ను కనికరించుము." అనేక పర్యాయములు నీతో మాటలాడు నిమిత్తము ఇతరులను ఉపయోగించునని నీవు తెలిసి కొందువు. కావున యెల్లప్పుడు ప్రభువే నీతో నేరుగామాటలాడవలయునని వేచియుండవద్దు.

అపొస్తలుల కార్యములు 18:9లో ఉన్న మాటలు పౌలుకు ఎల్లప్పుడు వచ్చుచుండెడివి కావు. అయితే దేవుని స్వరము ఆయన యొద్దకు వచ్చి అతడు అధైర్యపడినప్పుడు, శత్రువు బలముగా ఎదిరించినప్పుడు దేవుని స్వరము ప్రత్యక్షమై " నీవు భయపడక మాటలాడుము మౌనముగా నుండకుము. నేను నీకు తోడై యున్నాను. నీకు హాని చేయుటకు నీ మీదికి ఎవడును రాడు. ఈ పట్టణములో నాకు బహుజనమున్న"దని చెప్పెను. యిది మనము ఆయన నోటి బూరలుగాను, సాక్షులముగాను అగుట ద్వారానే మనము ఆయా సమయములలో ఆయన స్వరమును వినగలము. మనలో అనేకులను రక్షించి, కాపాడునటువంటి దేవుని శక్తిని గూర్చి కొన్ని మాటలు

చెప్పుటకు సహితము భయపడుదురు. దృష్టి పొందిన పుట్టుగ్రుడ్డివాడు ఎట్లు ధైర్యముగా సాక్ష్యమిచ్చెనో, అటువలె ప్రతి విశ్వాసి దేవునికి సాక్షియై యుండవలెను. "ఒకటి మాత్రము నేనెరుగుదును! నేను గ్రుడ్డి వాడనైయుండి యిప్పుడు చూచుచున్నా"నని, దృష్టి పొందిన గ్రుడ్డివాడు శ్రమ పెట్టబడినప్పుడు కూడ ఎట్లు ధైర్యముగా సాక్ష్యమిచ్చినాడో, అట్లే ప్రతి విశ్వాసి దేవునికి సాక్షియై యుండవలెను.

అది నీ సహపాటి విద్యార్థులకు చెప్పుట సాధ్యము కానిదా? మనలో అనేకులము తిరిగి జన్మించియున్నామని ఏదో ఒక కూటములో సాక్ష్యమిచ్చి యుందుము. అయితే నీవు నీ స్నేహితులకు, బంధువులకు, జతపనివారికి సహ విద్యార్థులకు రక్షించు ఆయన శక్తిని గూర్చి సాక్షిగా యున్నావా! వారు నిన్ను అపహసించినప్పటికిని " ఒక విషయము నే నెరుగుదును. నేను పాపినై యుంటిని. అయితే యేసుక్రీస్తు ప్రభువు నా పాపములను క్షమించెను" అని యధార్థముగా చెప్పగలవా? "ఇది ఒక దినమున ఒకానొక స్థలమున మొదటిసారిగా సంభవించెను. నేను సమాధానము కనుగొంటిని అని చెప్పవలెను. నీవు చెప్పునది వారంగీకరించక పోయినను, " ఒక విషయము నేనెరుగుదును. నేను సమాధానమును కనుగొంటిని" అని సమాధానముతోను సాక్ష్యమిచ్చు చుండుము. ఆ తర్వాత ఎప్పుడైన నీవు శత్రువుచే చుట్టబడి ఒంటరిగా నున్న సమయములో "భయపడకుము, దిగులు పడకుము నేను నీతో వున్నాను, నానామమున మాట్లాడుచుండుము." అని దేవుని స్వరము నీ యొద్దకు రావచ్చును. ఈ సాక్ష్యము దేవుని స్వరమును వినుటకు మనలను యోగ్యులనుగా చేయును.

ఇది నా అనుభవము. ప్రజల సమక్షములో మాటలాడుటకు నేను భయపడెడివాడను. నేను నత్తివాడను కనుక మాటలాడుటకు

కష్టపడెడివాడను. ఇది ఎంతో తత్తరపాటు కలిగించునదిగా నుండెను. అయితే " భయపడకుము నేను నీ నాలుకను ముట్టుదును, నీవు నా మనోభిప్రాయములను తెలియపరచువాడవు. నేను నిన్ను ఉపయోగించెదను" అని దేవుని స్వరము చెప్పెను. నాకొక సంగతి తెలియును " నా పాపములు క్షమించబడినవి, నిజమైన సమాధానము నాకున్నది." అని చెప్పితిని. ఆ సమాధానము నీకున్నదా! ఈ కొద్ది మాటలు స్వేచ్ఛతో చెప్పబడినవి. తరువాత 'నేను నీతో ఉన్నాను, నేను నీతో ఉన్నాను" అను స్వరమును వింటిని. కావున కాపాడి రక్షింపగల ప్రభువైన యేసుక్రీస్తు శక్తిని గూర్చి సాక్ష్యమిచ్చుచుండుము. దేవుడు తప్పక నీతో మాటలాడును.

యెరూషలేముకు వెళ్ళుమని ప్రభువు అపోస్తలుడైన పౌలునకు చెప్పెను. తరువాత రోమాకు కూడా వెళ్ళవలయునని ప్రభువు చెప్పెను. యెరూషలేమునకు వెళ్ళు మార్గములో, అగబు అను ప్రవక్త పౌలు నడికట్టును తీసికొని, తన చేతులను, కాళ్ళను కట్టుకొని, యెరూషలేము లోని యూదులు ఈ నడికట్టుగల మనిషిని ఈలాగు బంధించి అన్య జనుల చేతికి అప్పగింతురని పరిశుద్ధాత్మ చెప్పుచున్నాడనెను ( అపొ. కార్య. 21:11). వారు ఈ స్వరమును విన్నప్పుడు తన స్నేహితులు పౌలును యెరూషలేముకు పోవుట మాన్పవలెనని ప్రయత్నము చేసిరి. యెరూషలేమునకు పోవద్దనియు, అక్కడికి పోయిన యెడల పౌలు బంధింపబడునని" ప్రవక్త చెప్పలేదు. అయితే తన స్నేహితులు ప్రయాణము మాన్పి వేయవలెనని పౌలును ఒత్తిడి చేసినప్పుడు పౌలు "ఇదెందుకు? మీరు ఏడ్చి నా గుండె బ్రద్దలు చేసెదరేల? నేనైతే ప్రభువైన యేసు నామము నిమిత్తము బంధింపబడుటకే కాదు, చనిపోవుటకు కూడా సిద్ధముగా నున్నానని చెప్పెను" అప్పుడు వారు

" ప్రభువు చిత్తము జరుగును గాక" అని ఊరకుండిరి. అతడు యెరూషలేమునకు వెళ్ళిన తరువాత, రోమాకు వెళ్ళుట దేవుని చిత్తమని పౌలు సంపూర్ణముగా నెరిగి యుండెను.

పౌలు ఖైదీగా రోమాకు కొనిపోబడునప్పుడు, అక్కడ గొప్ప తుఫాను రేగి నశించు పరిస్థితులలో నుండిరి. ఓడలోని సరుకులన్నిటిని వారు తమ స్వహస్తములతో పారవేయుట మొదటనే మనము చూచి యున్నాము. త్రాళ్ళన్నియు త్రెంచ వేయబడినవి. మరియు తెరచాపలన్నియు క్రిందికి దించివేయబడినవి. ఆ తుఫాను ద్వారా జీవించగలమన్న యాశ లేకపోయెను. తరువాత మరల ప్రభువు పౌలునకు ప్రత్యక్షమై తన చిత్తమును తెలియచేసెను (అపొ. కార్య. 27:24) "పౌలా! భయపడకుము. నేను నీతో ఉన్నాను. నీవు కైసరు యెదుట నిలువ వలసియున్నది, ఇదిగో నీతో కూడా ఓడలో ప్రయాణము చేయుచున్న వారినందరిని నీకనుగ్రహించియున్నాను. వారు కూడా రక్షింపబడుదురని చెప్పెను. ఇతరులు "మేము నశించుచున్నాము నశించుచున్నాము", అనే భయముతో ఏడ్చుచు అరచుచుండగా మీరు రక్షింపబడుదురన్న నిరీక్షణ వారికి కలుగచేసెను. తరువాత పౌలు - నేనెవరివాడనో ఎవరిని సేవించుచున్నానో ఆయన దూత నా యొద్ద నిలువబడి "పౌలా! భయపడకుము నీవు తప్పక కైసరు ఎదుట నిలువవలయును ఇదిగో ఓడలోనున్న వారందరిని నీ కనుగ్రహించి యున్నానని" చెప్పెను. దేవుడు చెప్పినదంతయు నెరవేరెను. అందరును రక్షింపబడిరి. పౌలు, ఎట్లు దేవుని స్వరము వినగలిగెను? ఆయన దేవుని చిత్తము నెరిగి యుండెను కనుకనే. తాను రోమాకు వెళ్ళుట కూడా దేవుని చిత్తమై యుండెను. అందువలననే

ఆయన చెవులు దేవుని స్వరమును వినగల అతి చురుకైనవై యుండెను. నీవు దేవుని చిత్తములో నున్నప్పుడు దేవుని స్వరము మరల మరల నీతో మాటలాడుట వినగలవు.

దేవుని స్వరము స్థిరపరచునదిగా వచ్చును. నీవు స్పష్టముగా దేవుని స్వరమును వినగోరుచున్నావా? అట్లయిన యెడల దిన దినము దేవుని చిత్తమును కనుగొని అతి చిన్న విషయాలలో సహితము ఆయన చిత్తమును కనుగొని అతి చిన్న విషయాలలో సహితము ఆయన చిత్తంను నెరవేర్చుటకు నేర్చుకొనుము. "క్రైస్తవుడుగా నీ ఉన్నతాధిక్యత యేమని" ఎవరైనను ప్రశ్నించిన యెడల, దేవుని చిత్తమును తెలిసికొని దానిని నెరవేర్చుటయే నా యొక్క ఉన్నతాధిక్యతయని చెప్పెదను. ఎవరైతే దేవుని చిత్తము తెలిసికొని దానిని చేయుచున్నారో, వారు దేవుని వాక్యము ద్వారా తన వార్తావహుల ద్వారా లేక ఆయా పరిస్థితుల ద్వారా దానిని తెలిసికొనుచున్నారు.

యోహాను 12:2లో గ్రీకు దేశస్థులు యేసు ప్రభువును చూడవలెనను కోరికతో చాలా దూర ప్రదేశము నుండి వచ్చిరి. అంద్రేయను కలిసికొన్న ఫిలిప్పుతో వారి కోరికను తెలిపిరి. వారిద్దరు యేసు ప్రభువు యొద్దకు వెళ్లి ఈ గ్రీకులు తమ్మును జూడ గోరుచున్నారని చెప్పిరి. దీనికి యేసు ప్రభువిచ్చిన జవాబు 24, 28, 30 వచనములలో కలదు. ఈ మనుష్యులు యధార్థతతో ప్రభువును చూడవలెనని వచ్చిరి. ప్రభువు వారితో " మీరు కొద్ది నిమిషంలేనన్ను చూడవలెనని కోరుచున్నారు అయితే నన్ను నిత్యం చూచుటకును. ఎల్లప్పుడు వినుటకును సాధ్యమని చెప్పెను. నన్ను ఊరక చూచుట ద్వారా మీరు నిత్యమైన సంతృప్తి పొందరు. మీకొక రహస్యమును నేర్పుదును. నా మరణములో మీ మరణమును, నా పునరుత్థానములో

మీ నూతన జీవితమును జీవించుడి అప్పుడు నిజముగా మీరు నన్ను చూతురు. మరియు నా స్వరమును విందురు. ఇది 23వ వచనము యొక్క అర్థము ఇదియే విధముగా జరుగును. దీనికి జవాబు 24వ వచనములో కలదు. ఒక గోధుమ గింజను భూమిలో విత్తి నీరు పట్టుము. ఒక సంవత్సర కాలములో కొన్ని వేల గింజలను కూర్చెదవు. ఆ గోధుమ గింజలను అయిదు సంవత్సరముల వరకు విత్తుచు కోయుచునుండుము. అప్పుడు ఒక గోధుమ గింజ ద్వారా వచ్చిన గోధుమలన్నిటిని నింపుటకు ఒక గూడ్సు బండి చాలదు. ఒక గింజ ఎన్నో గింజలను ఫలింపచేసినట్లు ఆయన మరణ భూస్థాపన పునరుత్థానముల ద్వారా ఆయన వంటి కుమారులెందరినో కలుగజేయు చున్నాడు 1 యోహాను 3:2.

మన ప్రభువు రెండవ మారు వచ్చునప్పుడు ఆయన ఉన్నట్లు గానే ఆయనను చూచెదము మరియు మనము ఆయన వలె నుందుము యేసు క్రీస్తు ప్రభువు పరలోకమునకు వెళ్ళునప్పుడు, ఆయనను మరియు ఆయన చుట్టు ఎంతో మందిని మనము చూచెదము. "మేము యేసును చూడవలయును" అని గ్రీకులు చెప్పుచుండిరి. మన ప్రభువు మీరు నన్ను చూడవలెనని కోరుచున్నారు. అయితే నా వలె మిమ్మును చేయవలయునని కోరుచున్నానని జవాబిచ్చెను. ఎట్లైనను మీరు మొదట నా మరణములో మరణించి, నా పునరుత్థానమందు మీరు పాలి బాగస్థులైన తర్వాతనే  మీరు నావలె నుందురు. మరియు నిత్యము నా స్వరము విందురు.

యోహాను 17:2లో మన ప్రభువు "తండ్రీ, నీ కుమారుని మహిమ పరచుము. ఎంతో మంది నీ సంపూర్ణ మహిమలో నన్ను చూచి నా వలె మార్చబడుదురు" అని ప్రార్థించెను. అప్పుడు మన

సమస్త క్రియల ద్వారా మన మాయనను మహిమ పరచి నప్పుడు మాత్రమే ఆయన స్వరమును మనము విందుమని ఒక స్వరము వచ్చెను. విశ్వాసముతో ఈ విధముగా ప్రార్థించుము, "ప్రభువా! మీ నామము నా జీవితము ద్వారా ఉన్నతముగా హెచ్చింపబడునట్లు నేను జీవించగోరుచున్నాను. నా ద్వారా, నా తలంపుల ద్వారా, క్రియల ద్వారా, నీ నామము మహిమ పరచబడుచున్నదా?" నాకు చెప్పుము, సాధారణముగా మనము ప్రభువా! నా ప్రార్థనను మీరు తప్పక ఆలకింపవలయును, నా ప్రార్థనకు జవాబిచ్చిన యెడల నేను నీకు 10 రూ॥ లిచ్చెదను. లేక మొదటి తరగతిలో నేను ఉత్తీర్ణుడైన యెడల నీకు 10రూ॥ లిచ్చెదను. లేక మూడవ తరగతిలో ఉత్తీర్ణుడనైతే ఒక రూపాయి మాత్రమే యిచ్చెదను అని ప్రార్థించుదుము. ఇదే మన పరిస్థితి. నీవు ఉత్తీర్ణుడవైనను లేక తప్పిపోయినను, జీవించినను లేక మరణించినను, ఆరోగ్యముగా నున్నను లేక అనారోగ్యంగా నున్నను, పేదతనమున్నను లేక వర్థిల్లుచున్నను, "ప్రభువా ఎక్కడ నీ నామమును మహిమ పరచగలనో అక్కడ నన్నుంచుము ఇది తప్ప నేనేమి కోరుట లేదు" అని ప్రార్థించినప్పుడే తప్పక దేవుని స్వరమును విందువు. అప్పుడు నీవేమి చేయవలయునో ఆ స్వరము నీకు వినిపించును. దేవుడు తప్పక మాటలాడును. అయితే ఆయన స్వరము వినక మునుపు ఆయన ఇచ్చిన షరతులన్నియు నీవు నెరవేర్చవలయును.

☆

5వ అధ్యాయము

# సంపూర్ణ విధేయత

దేవుని స్వరము విని గుర్తుపట్టే రహస్యము నేర్చుకొనుట ద్వారా మన ప్రశ్నలన్నిటికి జవాబు పొందగలమని, మన సమస్యలు తీర్చబడగలవని పూర్ణ హృదయముతో మనము నమ్ముచున్నామా?

పర్వతము మీద కనుపరచబడిన నమూన ప్రకారము మోషే సాక్షపు గుడారమును నిర్మించి ముగించిన పిదప మాత్రమే దేవుని స్వరము వినగలిగెను. నిర్గమ 40:34లో దేవుని మహిమలో సాక్ష్య గుడారము నుండి పరిశుద్ధ స్థలములోనున్న కెరూబుల మధ్య నుండి దేవుని స్వరము వినబడనారంభించెను. ఎవరైనా దేవుని చిత్తము తెలిసికొన గోరినప్పుడు అతడు ప్రధాన యాజకుని యొద్దకు రావలెను. ప్రధాన యాజకుడు పరిశుద్ధ స్థలములో నుండి మాటలాడుచున్న దేవుని స్వరము వినవలెను. ఇప్పుడైతే ప్రభువైన యేసు క్రీస్తు మన పరమ ప్రధాన యాజకుడై యున్నాడు. ఎవరు ఆయనను స్వంత రక్షకునిగా అంగీకరించుదురో వారి హృదయములలో ఆయన నివసించును. వారి శరీరములు దేవుని ఆలయములుగా మార్చబడును.

ఇప్పుడు భూ సంబంధమైన ప్రధాన యాజకుని యొద్దకు పోవలసిన యక్కర లేదు. మానవుడు ప్రధాన యాజకుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవునితో సరాసరి మాటలాడవచ్చును. ఆయన యొద్ద నుండి జవాబు పొందవచ్చును. అనుదినము దేవుని స్వరము వినవచ్చును. అయితే ఒకటి అవసరమైయున్నది. ఎవరైతే దేవుని స్వరము వినగోరుదురో వారు దేవుని ఆత్మ వారిలో నివసించుచున్నాడను

నిశ్చయత కలిగి యుండవలెను. మనమిది వరకే చూచిన రీతిగా దేవుని ఆత్మ మన లోనికి వచ్చినప్పుడు మనలో మూడు విధములైన మార్పులు కలుగును. మనము పాపులమై యున్నప్పుడు మృతమైన ఆత్మ కలిగియుంటిమి. అంతేగాక అపవిత్రమైన శరీరము, అంధకార మయమైన మనస్సు కలిగియుంటిమి. దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన మనలో ప్రవేశించక ముందు తలంపుద్వారా మాట ద్వారా క్రియ ద్వారా కలిగిన ప్రతి అపవిత్రత నుండి క్రీస్తు తన రక్తము చేత మొట్టమొదట మనలను కడుగవలెను. పాత నిబంధన కాలములో మనుష్యులు సాక్ష్యపు గుడారముపై మహిమ నిలిచి యుండుట యెట్లు చూడగలిగిరో అట్లే తిరిగి జన్మించిన వారు దేవుని సాన్నిధ్యం వారిలోను, వారితోను నిత్యమున్నట్లు యెరిగి యుందురు. అట్టి అనుభవము మానవ ప్రయత్నము వలన కలుగదు. వారిని నడిపించి వారికి సహాయము చేయుగల ఒకరు వారితోనున్నట్లు గ్రహించుదురు.

పాపము మాత్రమే దేవుని సాన్నిధ్యమును మనము అనుభవించకుండ నాటంకపరుచును. అయితే పాపము మరల మనల క్షమించబడి ఆయన రక్తముచేత కడుగబడగలదు.

మన ప్రభువైన యేసుక్రీస్తు తన బహిరంగ పరిచర్య నారంభించినప్పుడు పరలోకము తెరువబడి పరిశుద్ధాత్మ పావురం వలె ఆయన పైకి దిగివచ్చెను. మరియు పరలోకము నుండి యొక స్వరము వినబడెను. పరలోకము మనకు తెరవబడి పరిశుద్ధాత్మ మనమీద నిలిచి యుండునట్లు మనము అనుదినము పరిశుద్ధాత్మ చేత నడిపించ బడునట్లు దేవుని స్వరము వినగలుగునట్లు చేయుటకై యేసుప్రభువు ఈ లోకములోనికి వచ్చెను. అనేక మార్గముల ద్వారా మనము దేవుని స్వరము విని విధేయులము కావచ్చును. దేవుడు ఆత్మయై యున్నాడు.

ఆయన స్వరము కూడ ఆత్మ సంబంధముగా నుండును. అందువలన దేవుని ఆత్మను చేతులతోగాని పాదములతో గాని స్పర్శించలేము. మన మాయనను మన ఆత్మలో చూడగలము, వినగలము. ఆయన స్వరము ఆత్మ సంబంధమైనది. మన చెవులతో ఆయన స్వరము కొన్ని సమయాలలో వినవచ్చును గాని అట్టి సమయాలు బహుకొద్దిగా నుండును. మన ఆత్మ అనుదినము ఆయన స్వరమును తేటగా గ్రహించగలదు, అయితే ఆ స్వరము వినవలెనంటే మన ఆత్మ పవిత్ర పరచబడినట్లు నిశ్చయత కలిగి యుండవలెను. మత్త 5:8; అపొ.కా. 10:14. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడనేరడు హెబ్రీ 12:14.

వివిధమైన సాక్షుల ద్వారా మాటలాడుటకు దేవుడెట్లు నిశ్చయించుకొనెనో మనము చూచితిమి. అపొ.కా. 8 అధ్యాయములో దేవుని సాక్షి ఫిలిప్పు పేరుతో పిలువబడెను. సమరయ అని పిలువబడు ప్రాంతములో దేవుడాయనను బహుబలముగా వాడుకొనెను. సమరయులు యూదుల చేత ద్వేషింపబడి త్యణీకరింపబడుచుండిరి. అయితే త్యణీకరింపబడిన మనుష్యులకు సువార్త చెప్పుటకై ఫిలిప్పు సాక్షిగా వెళ్లెను.దేవుడాయనను బహు బలముగా వాడుకొన ఆరంభించెను. అతడు మార్పుబడిన వ్యక్తియే తప్ప అతడెన్నటికీ సమరయకు వెళ్ళియుండెడివాడు కాడు. ఏలయనగా అట్టి ప్రజల యొద్దకు వెళ్ళుటకై దేవుని ప్రేమయే ఆయనను బలవంతపెట్టి యుండవచ్చును. కావున దేవుడాయన పరివర్తను ఆ పట్టణములో బహుబలముగా వాడుకొనెను. అప్పుడు హఠాత్తుగా దేవుని యాజ్ఞ యిట్లు వచ్చెను. "లేచి దక్షిణ దిక్కుగా వెళ్ళుము. " దేవుని కతడు వెంటనే విధేయుడాయెను. సమరయ దేశములో దేవుని చేత నతడు బహుబలముగా వాడుకొనబడు

చుండెను. ఆయన పరిచర్య సేవ అచ్చట చాల అవసరమై యుండెను. అతడొక వేళ "నేనిక్కడ చేయుచున్న పని ఎంతో గొప్పది, యిది దేవుని పనియై యున్నది. ఈ క్రొత్త విశ్వాసులందరిని బలపరచి ప్రభువులో వీరిని కట్టవలెను. ఇటు వంటి ముఖ్యమైన పని విడిచిపెట్టి ఆ నిర్మానుష్యమైన యెడారికి నేనెట్లు వెళ్ళగలను?" అని తన హృదయమున తలంచి ఉండవచ్చును.

ఎందుకతడు సమరయ విడిచిపెట్టి ఆ ఎడారిలోనికి వెళ్ళవలెనో దేవుడెన్నడు వివరించలేదు. మనమిదివరకే చూచిన రీతిగా దేవుడెప్పుడు ఒకేసారి తన చిత్తమంతయు బయలు పరచడు. అయితే మానవ మాత్రులమైన మనము సంగతులన్నియు ముందే తెలిసికొని ఆసక్తి కలిగి యుందుము. మానవ బలహీనత అట్టిది. కాని దేవుడు ఒక్కొక్కసారి కొద్ది సంగతులు మాత్రమే మాట్లాడును. ఆరంభములోనే దేవుడొక గొప్ప కార్యక్రమ మందించడు. దేవుడు ఫిలిప్పుతో "లేచి గాజాకు వెళ్ళుము" అని చెప్పెను. అక్కడికి వెళ్ళవలసిన యవసర మేమిటో చెప్పకయే వెళ్ళుమనెను. అతడా మాటకు విధేయుడైనప్పుడు వెళ్ళ మనుటకు కారణమేమో అతడు కనుగొనెను.

దేవుని స్వరము వినుటకిది ప్రాముఖ్యమైన షరతు. నీవు దేవుడేమి సెలవిచ్చునో దానికి యెదురాడక దాని ప్రకారము వెళ్ళి చేయుట కిష్టము కలిగియుండవలెను. తరచుగా నీ మనస్సు మార్గమున కడ్డముగా వచ్చుచుండుట కనుగొందువు. అప్పుడు నీవు దేవుని ప్రశ్నించుచు దేవునితో నెదురాడ నారంభించెదవు. అట్లయితే నీవు దేవుని స్వరమును వినుటకు చాలా కాలము పట్టును అయితే నీ చెవులను చురుకుగాను, తేటగాను యుంచుకొనిన యెడల నీవు దేవుని స్వరము స్పష్టముగా విందువు.

కొన్ని సంవత్సరము క్రితవా అర్ధరాత్రి పరుండబోవుటకు ముందు నేను ప్రార్థించుచుండగా " సువార్త తీసికొని బయటకువెళ్ళుము' ' అను దేవుని స్వరము వింటిని. అప్పుడు నేను " యింత రాత్రివేళ బయట ఎవరుందురు?" అయినను నాకోటు వేసుకొని సువార్తను చేతబట్టుకొని బయటకు వెళ్ళితిని. అప్పుడు నాకు ముందుగా యిద్దరు మనుష్యులు నడచివెళ్ళుట కనుగొంటిని. వారితో "ఒక్క నిమిషము దయచేసి ఆగెదరా?" అని అడిగితిని. వారు "మమ్మెందుకు ఆపగోరుచున్నావు?" అందుకు "నేను పరుండ పోవుచుండగా నేను దేవుని స్వరమును వింటిని ఆయన నాతో కుడివైపుగా వెళ్ళుము. కుడివైపుగా వెళ్లుము, మీ యిద్దరి కొరకై నాయొద్ద ఒక వర్తమాన మున్నది" అని చెప్పితిని. వారిద్దరిలో ఒక యౌవనస్థుడు నాతో యిట్లనెను " నీవు చెప్పినది సరిగా నున్నది, నా నిమిత్తమే దేవుడు నిన్ను పంపెను. జీవితమంటే నాకు విసుగు పుట్టినది. నాకు దేవుని వర్తమానమిమ్ము." రక్షణ మార్గము అతనికి బోధించే సంతోషము నేను కలిగియుంటిని.

ఏ ప్రశ్న వేయక దేవునికి విధేయుడనైన కొలది దేవుడు నాకు క్రొత్త ఆజ్ఞలు యిచ్చుచుండుట అనుభవము వలన నేను కనుగొంటిని. ఫిలిప్పు కూడ యిలాగే సంభవించెను. అతడు యెడారిలోకి వెళ్ళెను, అక్కడ రథము మీద ప్రయాణించుచున్న ఒక మనుష్యుని చూచెను. అప్పటికి దేవుడెందుకు అతనికి వెళ్ళుమని సెలవిచ్చెనో చెప్పలేదు. అప్పుడు ఫిలిప్పు "నేనొక దొంగవలె ఈ రథమును వెంబడించుచున్నాను" అనుకొని యుండవచ్చును. అయినను అతడు దేవునిని ప్రశ్నించలేదు. అపొ. కార్య. 8:30 లో ఫిలిప్పు ఆ రథము వెంతడు పరుగెత్తి ఆ మనుష్యుడు యెషయా 53వ అధ్యా.

నడువుచుండుట వినెను. అందులోనే రహస్యమిమిడి యున్నది. దేవుడు చేయుమని నీకేది చెప్పినను సంతోషముతో వెంటనే చేయుము. ఒక దినమున ఒక మనుష్యుడు నా ముందు నడుచుట చూచితిని. దేవుడు నాతో "వెళ్ళి అతనిని ఆపుము" అని చెప్పెను. నేను వెళ్ళి అతని భుజము మీదచేతులుంచగా అతడు ఆగి "నేను తీరిక లేని వాడను నన్నెందుకు ఆపితివి" అని నాతో అని నడువనారంభించెను. మరల నేనతనిని ఆపితిని. అతడు తిరిగి అదే మాటలు పలికి యింకా "ఎందుకు నా కాలము ఈ విధముగా వ్యర్థము చేయుచున్నావు?" అని అనెను. నేను "ఎందుకనగా దేవుడు నన్ను పంపినందుననే". ఆ మనుష్యుడు "నేనది నమ్మను. నా సమయము యింకెంత మాత్రము వ్యర్థము చేయవద్దు" అని జవాబిచ్చెను. ఇంకొకసారి ఆయన వెంటబడి అతనిని ఆపి "దయచేసి కొంచెము సేపు ఆగుము" అని బ్రతిమాలితిని. అప్పుడతడు "నీతో యథార్థముగా చెప్పవలెనంటే నేను నా జీవితము మీద విసిగి ఆత్మహత్య చేసికొనబోవుచున్నాను" అని జవాబిచ్చెను. అప్పుడు నేను " నీవది చేయకుండ నేను ఆపుట లేదు. నీవది యిప్పుడైనను తరువాతయైనను చేయవచ్చును. ఒక అర్ధగంట నీ సమయము నాకిచ్చుట వలన నీకేమియు నష్టము లేదు. ఆ తరువాత నీవెక్కడ ఆత్మహత్య చేసికొనవలెనని కోరుచున్నావో ఆ స్థలమునకు స్వేచ్ఛగా వెళ్ళవచ్చును నిన్నెంత మాత్రము ఆపనని వాగ్దానము చేయుచున్నాను" అని చెప్పితిని. అప్పుడతడు నా మాట సంగీకరించెను. మేమిద్దరము దగ్గరలోనున్న యొక పార్కులోనికి వెళ్ళితిమి. వెంటనే నేను నా బైబిలు తీసి చిన్న ప్రార్థన చేసి వర్తమానమును అందించితిని. మరల నేను ప్రార్థించి " ఇప్పుడు నీవు స్వేచ్ఛగా వెళ్ళి ఆత్మహత్య చేసికొనవచ్చు"నని అతనితో చెప్పితిని. అతడు "ఆత్మహత్య చేసికొనవలెనను కోరిక నానుండి పోయినది, మరల నిన్ను నేనెప్పుడు

కలిసికొనగలను?" అని అడిగెను. అతడు రెండు మూడు పర్యాయములు నన్ను దర్శించిన తరువాత తిరిగి జన్మించెను.

మారుమాట్లాడక ప్రభువుకు విధేయులమగుటే రహస్యము అర్థరాత్రియైనను లేక ప్రాతఃకాలమైనను లేక మధ్యాహ్న సమయమైనను, దినమందు ఏ సమయమైనను సరే నీవు చేయుటకో, చెప్పుటకో బలవంత పెట్టుచున్న పరిశుద్ధాత్మ యొక్క లోతైన సూచన యొకటి నీ ఆత్మ మీద ముద్రించబడును.

దేవుడు యేమి బోధించవలెనో అది ఫిలిప్పుకెప్పుడు చెప్పలేదు గాని అతడేమైతే మాట్లాడెనో లేక బోధించెనో అదంతయు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడినదని మనము తేటగా కనుగొనగలము. అతడు రథము దగ్గరగా వెళ్ళి ఐతియొపీయుడు యెషయా గ్రంథములోని 53 అధ్యాయము చదువుచుండగా వినెను. అది ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అద్భుతమైన ప్రవచనము.క్రీస్తుకు పూర్వము 750 సంవత్సరములకు ముందే ఈ ప్రవచనము వివరముగా వ్రాయబడెను. ఐతియొపీయుడు యీ భాగమును చదువుచున్నప్పుడు దేవుడు గాజాకు పోవు మార్గములోకి యెందుకు పొమ్మనెనో అతడు గ్రహించెను. వెంటనే అతని ఆత్మ దేవుని వర్తమానము అందుకొనెను. పరిశుద్ధాత్మ ద్వారా అతడు ఐతియోపీయునికి ఈ ప్రశ్న వేసెను "నీవు చదువునది గ్రహించుచున్నావా?" ఈ నిమ్మళమైన విధానములో ప్రభువు తన ఆలోచనలను, మాటలను మనలో నుంచును. కావున మనము మాట్లాడుట కారంభించినప్పుడు తరచుగా వాక్యము నదీ ప్రవాహమువలె వచ్చుట కనుగొందుము. అతని ప్రశ్నకు ఐతియోపీయుడు "ఎవరైనా నాకు త్రోవ చూపకుంటే యేలాగు గ్రహింపగలనని" జవాబిచ్చెను (వ.31). అతడు ఫిలిప్పును రథము మీద నెక్కించుకొని తన ప్రక్కన కూర్చుండ

బెట్టుకొనెను. ఫిలిప్పు ఆ రథము దగ్గరకు వచ్చి రథము నాపుమని అడిగినప్పుడు, అతడు ఫిలిప్పు తనకు హాని చేయుటకై వచ్చిన యొక దొంగయని తలంచి రథము నాపుటకు ఒప్పుకొనక పోయి యుండవచ్చును.

అమెరికా దేశములో చాల మంది మనుష్యులు ఎక్కుటకై వెళ్ళుచున్న కార్లను ఆపుదురు. కొన్ని పర్యాయములు కార్లు ఆగి మనుష్యులను ఎక్కించుకొని పోవును. కొన్నిసార్లు ఆగకుండా వెళ్ళిపోవును. కొన్ని పర్యాయములు కారులో నున్న వారు అపుచున్న మనుష్యుని అనుమానించి ఆపకయే వెళ్ళిపోవుదురు ఫిలిప్పుకు కూడా యిలాగు సంభవించియుండవచ్చును. అయితే అతడు మానవ జ్ఞానము నాధారము చేసికొనకుండ పరిశుద్ధాత్మ ఆజ్ఞలకు లోబడుచుండెను. ఐతియోపీయుడే రథమును ఆపి ఫిలిప్పును లోపలికి ఆహ్వానించెను. "దయచేసి లోపలికి వచ్చి నాతో కూర్చుండి ఈ వాక్య భాగమును నాకు వివరించి చెప్పు" మనెను. అప్పుడు ఫిలిప్పు ఆ వాక్య బాగము నెంతో తేటగా వివరించి పాపుల కొరకు యేసుక్రీస్తు మృతిపొందెనని అతని నొప్పించెను, నీవు దేవుని వాక్యమునకు విధేయుడవైనప్పుడే నీ నోట ఆయన మాటలుంచుటకును మత్తయి 10:20; లూకా 12:12; 21:15 వాగ్దానముల ప్రకారము చూచెదవు. నీవు దేవుని స్వరము అడుగడుగునకు నిన్ను నడిపించుట మాత్రమే కాక పరిశుద్ధాత్మ నీ పెదవులను ముట్టి నీవు కలిసికొను మనిషి కవసరమైన మాటలు నీ నోట నుంచుటయు కనుగొందువు.

ఒక అర్థరాత్రి ఒక రైల్వే స్టేషనులో నేనొక యౌవనస్తుని కలిసికొంటిని. నేనతనికొక కరపత్రమును ఒక సువార్తను యిచ్చి, అతనితో "ఆలస్యము చేయవద్దు, ప్రభువైన యేసుక్రీస్తు కొరకు యిప్పుడే

తీర్మానించుకొనుము" అని చెప్పితిని. అప్పుడు నాతో " నేనిప్పుడు తీర్మానించుకొనలేను. దీనిని గూర్చి యింకా ఆలోచించెదను, అనెను. నేనతనితో "నీవు 5 రూపాయలు పోగొట్టుకొంటివనుకొనుము" "రేపుగాని, యెల్లుండిగాని దాని కొరకు వెతికెదను" అని నీవు చెప్పుదువా? అప్పుడతడు "నేను 5 రూపాయలు పోగొట్టుకొంటినని యెవరు నీతో చెప్పిరి" అని ప్రశ్నించెను. అందుకు నేను " నాకెవరు చెప్పలేదు. నాకా సంగతే తెలియదంటిని" ఆ యౌవనస్థుడు నాతో "ఇప్పుడే నేను బుక్కింగు ఆఫీసుకు పోయి టిక్కెట్టు కొంటిని. తరువాత నా జేబులో నుండి డబ్బు తీసి లెక్కించగా 5 రూపాయలు తక్కువైనట్లు కనుగొంటిని. నేను బుక్కింగు గుమాస్తా వద్దకు వెళ్ళి అడుగగా అతడు నా మాటలు వినిపించుకొనలేదు. ఐదు రూపాయలు పోగొట్టుకొన్నందుకై కలత చెందియున్నా"నని చెప్పెను. నాకైతే ఆ సంగతి యేమియు తెలిదు. కొన్ని సామాన్యమైన మాటల ద్వారా అతడు దేవుని వాక్యము నంగీకరించెను. ఈ రీతిగానే నీ స్నేహితుల కొరకు, నీ బంధువుల కొరకు దేవుడు సరియైన మాటలు నీ నోట నుంచును. నీవు దేవుని స్వరమును తేటగా వినలేకపోయినప్పటికి జీవము గల దేవుడు తన నోరుగా నిన్ను ఉపయోగించుకొనుటకై ఆయన మాటలు నీ నోట నుంచును అప్పుడు నీవు అనేక మంది మనుష్యులకు ఉత్తేజము, బలము, సంతోషము కలిగించువాడవుగా నుందువు. ఆయన స్వరమునకు విధేయత చూపించుట ఎంతో సంతోషకరము! ఆయనను నీవు ప్రశ్నించవద్దు, ఆయనతో నీవు వాదించవద్దు.

[illegible] సంవత్సరముల క్రితము నేను ఉదయము 4 గంటలకు లేచి నా యింటి కిటికీ వద్ద ఒక గుంపు పాటలు పాడుచుండుట వింటిని. యెషయా 33:17లో నుండి ఈ మాటలు బహు తేటగా

నాయొద్దకు వచ్చెను. "అలంకరించబడిన రాజును నీవు కన్నులారా చూచెదవు. బహు దూరమునకు వ్యాపించుచున్న దేశము నీకు కనబడును" ఈ రీతిగా మూడు దినముల వరకు ఉదయకాలము 4 గంటల వేళకు జరిగెను. నేను ఆ గుంపు పాటను ఆ మాటలను కూడ వింటిని. అప్పుడు నేను మరుసటి ఆదివారము ఉదయము కొరకైన వర్తమానము నాకిచ్చెనని తలంచితిని. కావున ఆదివారము ఉదయకాలము ఈ వాక్యము మీద వర్తమాన మిచ్చితిని. సోమవారము ఉదయము కూడా అదే విధముగా చేసితిని. అప్పుడు నేను " ప్రభువా, ఈ మాటల ద్వారా నీవు నాకేమి వర్తమాన మిచ్చుచున్నావు? గత నాలుగు ఉదయకాలము లందు నీవీ మాటలు నా యొద్దకు పంపియున్నావు అని అడిగితిని. అప్పుడు ప్రభువు నాతో చాల దూరదేశము వెళ్లుటకై సిద్ధపడుమని సెలవిచ్చెను. కావున వెంటనే నేను పాస్‌పోర్టు కొరకు దరఖాస్తు పంపితిని. నాకు యెవరి యొద్ద నుండి ఆహ్వానము రానప్పటికీ సిద్ధపడుమని దేవుడు నాతో మాట్లాడి యున్నాడని నేను నమ్మితిని. ఆ దినములలో పాస్‌పోర్ట్ కొరకు దరఖాస్తు ఢిల్లీకి పంపవలసియుండెను. కొద్ది దినములలోనే ఫలాన దినమున ఫలాన ఓడ మీద ప్రయాణము చేయుటకు నాకు పాస్‌పోర్టు మంజూరు చేయబడినట్లు జవాబు పంపిరి. నాకు పాస్‌పోర్టు అప్పటికింకా అందకపోయినప్పటికి దేవుడు నా కొరకొక పరలోక సంబంధమైన యేర్పాటు చేసియున్నాడని నమ్మితిని సాధారణముగా పాస్‌పోర్టు సంపాదించుకొనుట కొరకు నెల దినములు పట్టును. అయితే ఒక వారము దినములలోనే అది దొరుకునట్లు దేవుడు నా పక్షముగా పనిచేయుట కనుగొంటిని.

నా మౌనధ్యాన సమయములో యెహెజ్కేలు 8:1లో నుండి "ఆరవ సంవత్సరము ఆరవ నెల అయిదవ దినమున ఈ మాటలు బహుబలముగా నా యొద్దకు వచ్చెను". మరల నేను " ప్రభువా! యీ మాటల అర్థమేమి?" అని నేను ప్రార్థించితిని. దేవుడు నాతో "1946 సం॥ము జూన్ నెల 5వ తేది లండను పట్టణములో ఉండవలెననీ కోరుచున్నాని" చెప్పెను. కావున నేను బొంబాయి పట్టణము వెళ్ళి ఓడ కంపెనీ వారిని చూచితిని. నేను "జూన్ 5వ తేది లండను చేరే ఓడయేదైనా ఉన్నదా?" అని వారినడిగితిని. వారు "అవును ఉన్నదండి, కాని దానిలో ఖాళీలేదు" అని చెప్పిరి. నేను రెండు పర్యాయములు వారి యొద్దకు వెళ్లి "ఎవరైన ప్రయాణము రద్దు చేసికొనిరా?" అని అడుగుతూ వచ్చితిని. వారు "లేదండీ అయితే యింకొక ఓడ వచ్చేవారము బయలుదేరును. దానిపై వెళ్ళుటకు మీకు టిక్కెట్టు యివ్వగలము" అని చెప్పిరి. దేవుడు నాతో స్పష్టముగా నీవు లండను పట్టణములో జూన్ నెల 5వ తేది నుండవలయునని చెప్పెను. ఆ రెండవ ఓడ ఆ తేదికి అక్కడ తప్పక చేరునో లేదో తెలియదు. అయినప్పటికి ఆ రెండవ ఓడ మీద ప్రయాణము చేయుటకు నేను టికెట్టు కొంటిని. నేను రెండవ ఓడ మీద జూన్ 5వ తేదికి లండను పట్టణము చేరుకొంటిని. ఆ మొదటి ఓడైతే యింజను చెడిపోవుట వలన నాలుగు దినములు ఆలస్యముగా లండను పట్టణము చేరెను. రెండవ ఓడ వేగముగా వెళ్ళగలిగినది. నేను దేవుని స్వరమునకు విధేయుడనగుట వలన సకాలమునకు లండను చేరగలిగితిని.

తరువాత జెకర్యా 9:10 లో నుండి నా మౌనధ్యాన సమయములో ఒక వచనము నాయొద్దకు వచ్చెను. 'సముద్రము నుండి సముద్రము వరకు' ప్రభువు నాతో "నేనింకొక సముద్రముదాటి

ముందుకు పోవలెను" అని నాతో చెప్పెను. నేను ప్రతి ఓడ కంపెనీ వారియొద్దకు, విమాన కంపెని వారి యొద్దకు వెళ్ళితిని గాని "ఖాళీలేదను" సమాధానమే నాకు వచ్చెను. నేనైతే దేవుడు నాతో మాట్లాడెను గనుక నాకేదో యొక మార్గము దొరకునని నమ్మితిని. ఒక ఉదయకాలమందు యెషయా 43:16 చదువుచుంటిని. "సముద్రములో త్రోవ కలుగజేయువాడును, వడిగల జలములలో మార్గము కలుగ జేయువాడును ఈలాగు సెలవిచ్చుచున్నాడు". కావున నాకు ప్రయాణ సౌకర్యము దొరకునని నిశ్చయము చేసికొని ఓడ కంపెనీ వారి యొద్దకు వెళ్ళి "అయ్యా ఈ దినమైన నాకేదైనా అవకాశమున్నదా?" అని అడిగితిని. ఆ మనుష్యుడు " అవునండీ యీ ఒక్క మార్గమున్నది. హైకమీషనర్‌గారు నీ విషయమై సిఫారసు చేసిన యెడల నీకు టిక్కెట్టు దొరుకును. వారు సాధారణముగా ప్రభుత్వోద్యోగులకు మాత్రమే సిఫారసు చేయుదురు" అని నాతో చెప్పెను. నేను వెళ్ళి ప్రయత్నించవలెనని తీర్మానించుకొంటిని. నేను హైకమీషనర్ గారి కార్యాలయమునకు వెళ్ళగా సబ్బంది ఉద్యోగి నన్ను "నీవు ప్రభుత్వోద్యోగివా?" అని అడిగెను. నేను "లేదండీ నేను దేవుని సేవకుడను" అని చెప్పితిని "అది చాలును' ' అని అతడు చెప్పెను. నాకు ప్రయాణపు సౌకర్యము దొరికెను. నేను న్యూయార్కు పట్టణము చేరువలో నుండగా రూబెన్‌లాసన్ అనువ్యక్తి నన్ను చూచుటకై వేచియున్నాడను వర్తమానము నాకందెను. చాల సంవత్సరముల వరకు నేనాయనను చూడలేదు. నేను 1930 సం॥ములో ఆయనను కలిసికొని యుంటిని. అదియు కొద్ది సమయము మాత్రమే. గత 10సం॥ముల నుండి ఆయనెక్కడుండెడిది నాకు తెలియదు. నేనక్కడకు వచ్చితినని ఆయనెట్లు కనుగొనెను? నేను ఓడదిగిన వెంటనే అక్కడాయనను చూచితిని. ఆయన నాతో " ప్రార్థన ద్వారా నీవు అమెరికా దేశము వచ్చితివి. అమెరికా దేశములో నున్న భారత దేశస్థుల

కొరకు మేము వర్తమానములు రికార్డు చేయుటకై హిందీ తెలిసిన వారి కొరకు ప్రార్థించు చుంటిమి, ఈ ఉదయమే చేంబర్స్ అనువ్యక్తి సహోదరుడు భక్తసింగ్ న్యూయార్కు పట్టణమునకు వచ్చుచున్నాడని చెప్పుట వింటిని ఇందుకొరకే నిన్ను కలిసికొనుటకై వచ్చితిని". ఆ పట్టణములో దిగిన దినము ఒక వర్తమానము రికార్డు చేసితిని. ముప్పై ఐదు నిమిషముల కాలము పట్టు ఒక్కొక్క వర్తమానము దినమొకటి చొప్పున ముప్పై ఐదు వర్తమానములు రికార్డు చేయు అవకాశము నాకు దొరికెను. ఈ దినము వరకు కూడ దక్షిణ అమెరికా దేశమందు ఆ వర్తమానములు రేడియో ద్వారా ప్రకటించబడుచున్నవి.

నాకే దేశముగాని, యే దేశములోని పట్టణమునుగాని చూడవలెనని యెట్టి కొనవలెనని ఆశయేలేదని వినయముతోను యథార్థముగాను చెప్పగలను. ఆయన పరిపూర్ణమైన చిత్తప్రకారము ఆయన సాక్షిగా వాడబడవలెనను ఒకే ఒక కోరిక నాకున్నది. ఆ రీతిగా దేవుడు దిన దినము నిమ్మళముగా పనిచేయుచుండును; ఎవరికైన రక్షణ మార్గము చూపించుటకుగాని లేక అదరించుటకుగాని లేక సహాయము చేయుటకుగాని దేవుని చేత వాడబడవలెనని ఆశపడిన యెడల దేవుని స్వరము వినుట నీకు సులభసాధ్యమగును. అప్పుడు వాదించక, యే ప్రశ్న వేయక ఆయన నీకేమి ఆజ్ఞాపించినను, యేమిచెప్పినను నీవు లోబడుదువు. అప్పుడాయన నీకు పరలోక యేర్పాటు చొప్పున సరియైన మనుష్యులను చూపించి ఆయా వ్యక్తికి తగిన వర్తమానము కూడ అందించును. ఈ రీతిగా ప్రతిదినము ప్రతి అడుగునకు దేవుని స్వరము వినగలిగే ఘనతను నిరూపించుటకు అనేక వృత్తాంతములు నేను మీకు చెప్పగలను.

లోబడుటకు ఆశ కలిగియుండుము. ఆయనయేమి సెలవిచ్చినను ప్రశ్నించక అలాగు చేయుము. నీవాయన మొదటి పిలుపుకు లోబడితావా: "ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చెదను" (ప్రకటన 3:20). జీవముగల యేసుప్రభువు నీ లోపలకు వచ్చియున్నాడను నిశ్చయత కలిగియుండుము. మృతుడైన మనుష్యుడు దేవుని స్వరము వినలేడు. నీవు తిరిగి జన్మించనట్లైతే నీ వాత్మీయముగా మృతుడవే. దేవుడు నీ పాపములు క్షమించి యుండని యెడల నీ వాత్మీయముగా చెవిటివాడవును, మూగవాడవును, అంధుడవునై యున్నావు. మేము మిమ్ములను మొదట ప్రభువైన యేసుక్రీస్తును మీ జీవముగల రక్షకునిగాను, స్నేహితునిగాను అంగీకరించుడని మనవి చేయుచున్నాము. అటు తరువాత దినదినము విశ్వాసముతో "ప్రభువా, నాతో మాటలాడుము. నన్ను నడిపించుము. అనుదినము నాకు సహాయము చేయుము. ఓ దేవా! నేను నీ కొరకే బ్రతుకగోరుచున్నాను. నీవు నాతో మాట్లాడు పర్యంతము నేను నీవలన వాడబడలేను, నీవు నన్నెక్కడికైనను పంపుము, ఎక్కడైనను ఉంచుము, నేను నీ చిత్త ప్రకారమే ఉండగోరుచున్నాను. ఓ ప్రభువా నీ సంతోషము యితరులతో పంచుకొనుటకు నాకు తగుణము దయచేయుము". అప్పుడు నీవు వినుచుండగా ఆయన మహిమగల స్వరము నీకు వినబడును. నీవు లోబడుకొలది పెప్పుశర్యముగాని సంతోషముతో నింపబడుదువు. అంతేకాక నీ జీవితములో ప్రతిచిన్న విషయమందు ఆయనచేత నడిపింపబడు అధికృత నీకు కలుగును.